Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

శుక్రవారం FRIDAY || 22.05.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 247 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah




## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత




### సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్

### రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, మే, 21 (సూర్యసేన ప్రతినిధి):** దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికా మ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేష న్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీ కుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

కాళేశ్వరం మే, 21 (సూర్యసేన ప్రతినిధి): సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహిస్తున్న



ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం.

## సమయపాలనలో..

## సీఎం ఆదర్శం




### తమిళనాడులో మారిన ఆఫీస్ కల్చర్

**– ఉద్యోగులు ఉదయం 9:50 కల్లా ఆఫీసులో ఉండాలని పలు శాఖల నుంచి ఆదేశాలు**

**– సీఎం విజయ్ ప్రతిరోజూ ఉదయం 10 గంటలకే కార్యాలయానికి వస్తుండటంతో ఈ మార్పులు**

**– సీఎం కాన్వాయ్ కారణంగా ఉదయం ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నామంటున్న ఉద్యోగులు**

**– పాలనలో క్రమశిక్షణ పెంచడమే లక్ష్యమని ప్రభుత్వ వర్గాల వెల్లడి**

**మే, 21 (సూర్యసేన ప్రతినిధి):** తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సచివాలయంలో పని సంస్కృతి పూర్తిగా మారుతోంది. ఆయన సమయపాలనను కచ్చితంగా పాటించడం ప్రభుత్వ శాఖలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో పలు విభాగాల్లో ఉద్యోగుల హాజరుపై కఠిన నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి. కార్యాలయాల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి విజయ్ పదవి చేపట్టినప్పటి నుంచి ప్రతిరోజూ ఉదయం 9:45 నుంచి 10 గంటల మధ్య సచివాలయానికి చేరుకుంటున్నారు. అధికారిక కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 4:30 లేదా 5 గంటల వరకు కార్యాలయంలోనే ఉంటున్నారు. సీఎం అనుసరిస్తున్న ఈ విధానం ఇతర శాఖల అధికారులను, సిబ్బందిని సైతం అప్రమత్తం చేస్తోంది. పని వేళలు ప్రారంభం కాకముందే ఉద్యోగులందరూ విధుల్లో ఉండేలా పరిపాలన విభాగాలపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మొట్టమొదటగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు ప్రధాన కార్యదర్శి పి.బి. శరవణకుమార్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉద్యోగులందరూ ఉదయం 9:50 గంటల కల్లా విధులకు హాజరు కావాలి. ఆఫీస్ అసిస్టెంట్లు ఉదయం 9:30 గంటలకే రావాలని స్పష్టం చేశారు. అండర్ సెక్రటరీలు ఉదయం 10 గంటలలోపు హాజరు రిజిస్టర్లను మూసివేసి, నివేదికను అదనపు ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి పంపాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనలు పాటించని వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే తరహా ఆదేశాలు ఇతర శాఖల్లోనూ జారీ అవుతున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. పాలనా సామర్థ్యాన్ని, క్రమశిక్షణను మెరుగుపరిచేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన : అయితే, ఈ కొత్త నిబంధనలపై కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కామరాజర్ సాలై, మెరీనా రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. సీఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో (ఉదయం 9:30 నుంచి 9:45 మధ్య) ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తుండటంతో కార్యాలయాలకు సమయానికి చేరుకోవడం కష్టంగా ఉందని వారు వాపోతున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎం. కరుణానిధి, జె. జయలలిత, ఎం.కె. స్టాలిన్ వంటి వారు కాస్త ఆలస్యంగా కార్యాలయానికి వచ్చేవారని, అప్పుడు ప్రయాణం సులువుగా ఉండేదని గుర్తుచేస్తున్నారు. అయితే, మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కొత్త క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు స్పష్టమవుతోంది.

## కార్మికులకు ప్రభుత్వం శుభవార్త



**కనీస వేతనాలు అమలుకు నిర్ణయం**

**కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం**

**లబ్ధిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు**

**బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు**

**కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మే, 21 (సూర్యసేన ప్రతినిధి):** కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు పక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ పక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది.

## రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

### అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు




**ముంబయి, మే, 21 (సూర్యసేన ప్రతినిధి):** రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

## రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభంపై

## కేబినెట్ సమావేశంలోనైనా కళ్లు తెరవండి"

### . సీఎం రేవంత్‌కి కేటీఆర్ లేఖ



**హైదరాబాద్, మే, 21 (సూర్యసేన ప్రతినిధి):** రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. "కేబినెట్ సమావేశంలోనైనా కళ్లు తెరవండి" అంటూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించిన కేటీఆర్, కొనుగోలు కేంద్రాల్లో రైతులు మరణిస్తున్న ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలు గడిచినా ప్రభుత్వం స్పందించడం లేదని, ముఖ్యమంత్రి ఇంకా మొద్దు నిద్రలోనే ఉన్నారని వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించిన ఆయన, రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడని, రాస్తారోకో జరగని రహదారి లేదని విమర్శించారు. రైతులు తమ పంటలను తామే తగలబెట్టుకునే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగుల కొరత, కొనుగోలు కేంద్రాల్లో తరుగుల వ్యవహారం, రైతులకు బోనస్ చెల్లింపుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. పంటలు కొనలేని పరిస్థితి ఉంటే రైతులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో మృతి చెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, ఈ నెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో రైతుల సమస్యలపై నిర్ణయం తీసుకోవాలని కేటీఆర్ కోరారు.

# మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇసుక రవాణాదారులకు కౌన్సిలింగ్



– జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**నల్గొండ / మిర్యాలగూడ రూరల్, మే 21 (సూర్య సేన) :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇసుక రవాణా ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారితో ప్రత్యేక కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. 2024 సంవత్సరంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ. 35 కోట్ల ఆదాయం వచ్చిందని, 2025 సంవత్సరంలో అది రూ. 43 కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుతం 2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఇసుక ద్వారానే ప్రభుత్వానికి రూ. 83 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా పరిధిలో ఈ సంవత్సరం ఇప్పటివరకు దాదాపు196 అక్రమ ఇసుక రవాణా కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాపై అత్యంత సీరియస్‌గా ఉందని, చట్టవ్యతిరేకంగా ఇసుక తరలింపుకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించడం, అధిక లోడ్‌తో వాహనాలు నడపడం, నకిలీ బిల్లులతో రవాణా చేయడం వంటి చర్యలు నేరమని తెలిపారు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘా కొనసాగు తోందన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా గురించి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అక్రమ ఇసుక రవాణా కేసుల్లో ఎలాంటి పైరవీలు, సిఫార్సులు నడవవని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో సహజ వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు,రూరల్ సీఐ పి.ఎన్.డి ప్రసాద్, ఎస్.ఐ లు లక్ష్మయ్య, కృష్ణయ్య ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో మంచి వైద్య సేవలు అందించాలి



– హాస్పటల్ పై దాడులు చేయొద్దు
– జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్.

**సూర్యాపేట టౌన్, మే 21 (సూర్య సేన) :** హాస్పిటల్స్, సామాగ్రిని ధ్వంసం చేసిన, హాస్పటల్ సిబ్బందిపై దాడులకు పాల్పడిన చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ తెలిపినారు. సూర్యాపేట లో హాస్పిటల్స్ పై దాడి, సామాగ్రి డామేజ్, సిబ్బందిపై దాడులు లాంటి సంఘటనలు జరుగుతున్న సందర్భంగా సూర్యాపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ప్రవేట్ ఆసుపత్రుల యాజమాన్యం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పి నరసింహ ఐపిఎస్ కి వినతి పత్రం అందజేశారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు పోలీస్ శాఖ రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హాస్పిటల్స్ వచ్చే రోగులకు, ప్రజలకు విలువైన వైద్య సేవలు అందించాలని ఐఎంఏ డాక్టర్లకు సూచించారు, ప్రజల నమ్మకం చూరగొనే విధంగా వైద్యం చేయాలని తెలిపినారు. నాణ్యమైన పరికరాలు నైపుణ్యం ఉన్న సిబ్బందిని హాస్పిటల్స్ నందు నియమించాలని తెలిపినారు. ప్రైవేట్ ఆస్పత్రి నందు వైద్య నిమిత్తం వచ్చిన ప్రజలు ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఆసుపత్రి యాజమాన్యాలను ఆసుపత్రులను లక్ష్యంగా దాడులు లాంటివి చేయకూడదని, సామాగ్రిని ధ్వంసం చేయడం సిబ్బందిని గాయపరచడం లాంటివి చేయకూడదని తెలిపారు. ఇలాంటివి చట్టపరంగా నేరమని అన్నారు.

ఇలాంటి సంఘటనలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అన్నారు, సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలు వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాల నందు నాణ్యమైన వైద్యం అందుతుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వినతి పత్రం అందజేసిన దానిలో సూర్యాపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆనంద్ దాంగ్డే, జనరల్ సెక్రెటరీ డాక్టర్ రమేష్, డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ అనూష, డాక్టర్ సుప్రజ, డాక్టర్ శ్రీరామ్ ఉన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు....







– పి.ఏ పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం, చిలకమర్రి గోడౌన్‌ను జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**దేవరకొండ / పీ.ఏ.పల్లి, మే 21 (సూర్య సేన) :** పి.ఏ.పల్లి మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చిలకమర్రి ధాన్యం నిల్వ గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ గురువారం పరిశీలించారు.

ఈ సందర్భంగా అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, నిల్వ ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు, రైతులకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, రైతులకు చెల్లింపులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. రైతులు ఎటువంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కొనుగోలు నుండి మిల్లింగ్ వరకు ప్రతి దశలో పారదర్శకత, సమయపాలన ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, మల్లేపల్లి సీఐ నవీన్, ఎస్ఐ నరసింహ, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ఐకేపీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఓపెన్ జోన్ ఎత్తివేయాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి



**రంగారెడ్డి, మే 21 (సూర్య సేన) :** బడంగ్ పేట సర్కిల్ లోఉన్న ఏజీ కాలనీ, రోమా –2 అల్మాస్గూడ, ప్రాంతాలలో అమలులో ఉన్న ఓపెన్ జోనును ఎత్తివేయాలని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై మాజీ మంత్రి ప్రస్తుత శాసన సభ్యురాలు

సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే హెచ్ఎండిఏ నుండి గెజిట్ తెప్పించినట్టు ఆమె తెలిపారు. ఆ ఫైల్ పై అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సంతకం పెట్టినట్లు ఈ విషయమై మరొకసారి మంత్రివర్యులు పరిశీలించాలని ఆమె శ్రీధర్ బాబును కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు ఈ విషయమై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకొని శాసన సభ్యురాలికి సమాచారం అందజేస్తామని అన్నారు.

# పకడ్బందీ ప్రణాళిక, పటిష్ట పర్యవేక్షణ, ఫలించిన వ్యూహం

– ధాన్యం సేకరణ...సత్ఫలితాలు ఇచ్చిన ప్రత్యేక కార్యాచరణ...!
– రౌండ్ ది క్లాక్ మానిటరింగ్ 24 × 7 అబ్జర్వేషన్
– నాలుగు రోజుల్లో ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి...ఇతర జిల్లాలకు సూర్యాపేట స్ఫూర్తి...!
– ధాన్యం సేకరణలో ప్రత్యేక శ్రద్ధతో 'పవర్' చూయించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట బాగా పండి అనూహ్యమైన దిగుబడులతో రైతన్నల కళ్ళలో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. అదే క్రమంలో గతంలో మాదిరిగా కాకుండా తమ వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న కష్టాలకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణతో ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాలను



విస్తృతంగా ఏర్పాటు చేసి సకాలంలో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకొని ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే లారీలకు ఎక్కించడం, వెంటనే రైతులకు డబ్బులు చెల్లించడం చకాచకా జరిగిపోతున్నాయి.

సూర్యాపేట జిల్లాలో మొత్తం ఐకెపి సెంటర్లు 179, మెప్మా సెంటర్లు 15, పిఏసిఎస్ సెంటర్లు 146, ఎఫ్ పి ఓ సెంటర్లు 14 మొత్తం జిల్లాలో 354 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇప్పటివరకు 46 కేంద్రాల్లో 100% ధాన్యం సేకరణ జరిగి ప్రస్తుతం 308 కేంద్రాల్లో ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఈ నేపద్యంలో సూర్యాపేట జిల్లాలో కూడా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విరివిగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతూ మరో నాలుగు రోజుల్లో సూర్యాపేట జిల్లాలో దాన్య సేకరణ లక్ష్యం పూర్తిగా నుండటం హర్షదాయకం.

**నాలుగు రోజుల్లో ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి... ఇతర జిల్లాలకు సూర్యాపేట స్ఫూర్తి**

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ధాన్యం సేకరణ విషయంలో తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ వలన మరొక నాలుగు రోజుల్లో సూర్యాపేట జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తిగానుంది. మే 21 తేదీ నాటికి సూర్యాపేట జిల్లాలో 3,85,514.920 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుకుంది. ఇప్పటివరకు 2,97,051.840 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 100% కొనుగోలు చేసి 709.66 కోట్ల రూపాయలను కేటాయించారు. మొత్తం 2,80,971.720 మెట్రిక్ టన్నుల ధాన్యం అంటే 95% ధాన్యము ను రైస్ మిల్లులకు తరలించి 671.24 కోట్ల రూపాయలను చెల్లించారు. మే 21వ తేదీ గురువారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 9,215.120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 22.01 కోట్ల రూపాయలను చెల్లించారు. ఇప్పటివరకు 1,97,194.400 మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసుకోగా అందుకుగాను 471.10 కోట్ల రూపాయలను కేటాయించారు. ఓ పి ఎం ఎస్ మిల్లర్లు 2,00,064.600 మెట్రిక్ టన్నుల ధాన్యం మొత్తాన్ని లక్ష్యానికి మించి 101 శాతం మిల్లులకు తరలించగా అందుకుగాను 477.95 కోట్ల రూపాయలను చెల్లించారు. ఓపిఎంఎస్ మిల్లర్లు 1,91,957.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలింపుకు 96% సిద్ధం చేయగా 458.59 కోట్ల రూపాయలు చెల్లించారు. ఓపిఎస్ మిల్లర్లు మరొక నాలుగు శాతం దాన్యం అంటే 8106.640 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించాల్సి ఉండగా అందుకు 19.37 కోట్ల రూపాయలను చెల్లించడానికి కేటాయింపులు చేశారు. మొత్తం మే 21 వరకు అవసరమైన 457.25 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉండగా మొత్తం 100% అంటే 457.25 కోట్ల రూపాయలను కేటాయించడం, 100% చెల్లించడం కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటవెంటనే రైతుల ఖాతాల్లో వేశారు. ఇప్పటివరకు ధాన్యం సేకరణ ఏజెన్సీల నుంచి బిల్లుల పేమెంట్ కొరకు 452.26 కోట్ల రూపాయలు బిల్లులు ఇవ్వగా 100% శాతం అంటే 452.26 కోట్ల రూపాయలను వెంటనే ఏజెన్సీలకు కూడా చెల్లించడం, వారు 100% అంటే 452.26 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించడం చక చక జరిగిపోయాయి. ఇప్పటివరకు మొత్తం 41,791 మంది రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయగా బ్యాంక్ అకౌంట్లు సరిగా సరిపోక, కొన్ని ఎకౌంట్లు రన్నింగ్ లో లేక కరెక్ట్ గా ఉన్న 31,217 రైతుల అకౌంట్లో డబ్బులు వేయటం జరిగింది. మిగతా రైతులు నుండి సరైన అకౌంట్లో తీసుకొని వారికి డబ్బులు వేసే ప్రక్రియ చురుకుగా కొనసాగుతుంది. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ లాగిన్ లో ఇంకా 4.99 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించడానికి సిద్ధంగా ఉంచారు.

**సత్ఫలితాలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ రౌండ్ ది క్లాక్ మానిటరింగ్ 24 × 7 గ్రౌండ్ వర్క్**

ఉదయాన్నే 6 గంటలకు ఆకస్మికంగా ధాన్యం మిల్లులలో ఏ విధంగా అన్లోడింగ్ జరుగుతుందో తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మిక తనిఖీలు చేయడం, ధాన్యం లోడింగ్ ఏ విధంగా జరుగుతుందో 24 గంటలు ఫలానా సమయం అని ప్రత్యేకించి పెట్టుకోకుండా అర్ధరాత్రి సమయం వరకు కూడా ఫీల్డ్ విజిట్ చేయడం, ఇలా పగలు, రాత్రి అనకుండా రౌండ్ ది క్లాక్ మానిటరింగ్ చేయడం, పకడ్బందీగా పర్యవేక్షించడం, వారిలో స్ఫూర్తి నింపడం, వారికి స్ఫూర్తిగా తాను నిలవడం, తాను పని చేస్తూ వారితో సకాలంలో పని చేయించడం, ఇలా అన్ని రంగాలలోనూ సాధించిన అనుభవంతో, ముందుచూపుతో జిల్లా కలెక్టర్ పవార్ తన పవర్ చూయిస్తూ ధాన్యం సేకరణ లో సూర్యాపేట జిల్లాను అగ్రగామిగా ఉంచడానికి అహోరాత్రులు శ్రమించి ఒక కొలిక్కి తీసుకువచ్చి మరో నాలుగు రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి కావడానికి వడివడిగా పరుగులు పెడుతున్నారు. ఇంత పెద్ద వ్యవస్థలో ఎక్కడో చోట చిన్న చిన్న పొరపాట్లు, తప్పిదాలను భూతద్దంలో వెతికే సో కాల్డ్ గ్లోబల్ ప్రచార విమర్శకులకు "టిట్ ఫర్ ట్యాట్" అన్నట్లుగా సమాధానాలు చెప్పే రీతిలో కాకుండా చేసి చూపిస్తూ "మాటలు కోటలు దాటినా చేతలు గడప దాటని" కోతల రాయుళ్ల మాదిరిగా కాకుండా "చేసేది చెప్పడం, చెప్పేదే చేయడం" అన్న రీతిలో వ్యవహరిస్తూ "కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు...చేసే వారికే విమర్శలు" అన్న నానుడి ప్రకారం సద్విమర్శలను సాదరంగా ఆహ్వానించడం కలెక్టర్ మేదో పరిణితికి మరో ఉదాహరణగా పేర్కొనవచ్చు. బస్ డ్రైవర్ అనుభవజ్ఞుడు అయితే బస్సులో ఉన్న వారందరూ ఎలా సేఫ్ గా ఉంటారో, జిల్లా పరిపాలన అధికారి కూడా డిసిప్లిన్ గా, కఠోర క్రమశిక్షణతోనీ, క్రమం తప్పని పర్యవేక్షణతోనీ, శ్రమించే తత్వంతో, రాజీ పడిన వ్యక్తిత్వంతో అందరిని కలుపుకుపోతూ "ధాన్యం సేకరణ లక్ష్యం కారాదు నిర్లక్ష్యం"అన్న స్లోగన్ తో ఇతర జిల్లా అధికారులకు ఆదర్శప్రాయుడుగా వయసులో చిన్నవాడైనా అనుభవంలో పెద్దవాడిలా తన అనుభవం, చైతన్య స్ఫూర్తి, మేధాశక్తితో, ధాన్యం కొనుగోలు దయనీయం కాకుండా రైతు ధైర్యంగా కొనుగోలు కేంద్రానికి వచ్చి పారదర్శకంగా తమ ఉత్పత్తులను అమ్ముకొని పోయే విధంగా ఆది నుంచి తుది వరకు, మొక్కవోని లక్ష్యంతో, ప్రత్యేక ప్రణాళికతో దాన్య సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తీసుకుంటున్న చర్యలు, పడుతున్న తపన, అహోరాత్రులు శ్రమ పట్ల జిల్లా ప్రజలే కాకుండా ప్రత్యేకించి అన్నదాతలు కలెక్టర్కు కృతజ్ఞతలతో కూడిన అభినందనలు అందజేస్తున్నారు.



ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ కృష్ణ బంటు

# సృజన్ క్లినిక్ ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



– మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.

**నల్గొండ టౌన్, మే 21 (సూర్య సేన) :** ఎముకలు కండరాలు,నరాలకు సంబంధించిన రోగాలతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు సృజన్ ఫిజియోథెరపీ రిహాబిలి టేషన్ క్లినిక్ వారు అత్యాధునిక పరికరాలతో అందిస్తున్న చికిత్సను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు. నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్లో నూతనంగా ఏర్పాటు చేసిన సృజన్ ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ క్లినిక్ ని గురువారం మేయర్ తో పాటు డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ అమీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్ ను పట్టణ ప్రజల సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని ఆమె సూచించారు. క్లినిక్ నిర్వాహకులు మేడి సృజన్ కుమార్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ లో పక్షవాతము భుజం,నొప్పులు, మూతి, వంకర పోవుట, నడుము నొప్పులు నరాలు చచ్చు బడుట, మోకాళ్ళ నొప్పులు, పార్కిన్ సన్స్ వ్యాధి, సెరిబ్రల్ పాల్సి, కీళ్లు మడవలేకపోవుట,మెడ నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, స్పోర్ట్స్ ఇంజురీస్ ట్రిగ్గర్ సింగర్, పోలియో వంటి వ్యాధులను అత్యాధునిక పరికరాలతో నయం చేయడం జరుగుతుందని తెలిపారు.

అదేవిధంగా పిల్లలకు వచ్చు పక్షవాతం, వృద్ధులకు మంచం మీద నుండి లేవలేని రోగులకు ఇంటి వద్దకే వచ్చి చికిత్స చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగూరి నవ్య రాకి, అమీనా పర్వీన్ సామద్, కొండూరు దీపిక ప్రవీణ్ రెడ్డి, మేడి లక్ష్మయ్య, యాదమ్మ, డాక్టర్ ఊహ, బుర్రి జాకొబ్, మేడి ప్రదీప్, జీవిత, కిష్టాఫర్ శౌరయ్య,ప్రవీణ్ కుమార్, సుమన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారికంగా పదవి బాధ్యతలు స్వీకరించిన, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ వైస్ చైర్మన్.



**రంగారెడ్డి, మే 21 (సూర్య సేన) :** బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ గాబసవరాజు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ గా పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ గురువారం బొగ్గులకుంట లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో అధికారిక పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బ్రాహ్మణ నాయకులు ఆయనను ఘనంగా సన్మానిస్తూ, ప్రసంగించారు. ఈ సందర్భంగా నందిరాజు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చైర్మన్ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో అభివృద్ధి జోడెడ్ల లాగా సాగాలని ఇద్దరిఆధ్వర్యంలో బ్రాహ్మణ సమాజాన్ని యువత బ్రాహ్మణులకు ఆర్థిక మంత్రిగా హోం శాఖ మంత్రిగా మీరు సూచించిన విధంగా మేమంతా పని చేస్తామని అన్నారు. బ్రాహ్మణ నాయకులు ఆలూరి మాట్లాడుతూ బ్రాహ్మణ జాతికి ఇది శుభదినం అని అందరిఅందరి ఇద్దురు బ్రాహ్మణ నాయకులు ఛార్జ్ తీసుకోవడం అభినందనీయమని యావత్ బ్రాహ్మణ జాతి తరపున వారికి స్వాగతంతెలుపుతున్నామని అన్నారు. రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, బడంగ్ పేట బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు మంగు రాఘవరావు మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘానికి ఇది శుభదినం అని మీ ఆధ్వర్యంలో మేమంతా ముందుకు వెళతామని, యావత్ బ్రాహ్మణ సంఘాలు మీకు మద్దతు అందజేస్తాయని అన్నారు, గత కొన్ని సంవత్సరాలుగా మీరు సంఘాలు చేస్తున్న కృషిని సేవను పరిశీలిస్తున్న సంగతి మాకు తెలుసునని అదేవిధంగా ఆయా సంఘాలలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వ్యక్తులను మీ వెంట నడిచే విధంగా శాయశక్తుల కృషి చేస్తారని ఆశిస్తున్నాను అన్నారు. ప్రముఖ బ్రాహ్మణ నాయకులు ప్రమోద్ కొటారు మాట్లాడుతూ తెలంగాణ బ్రాహ్మణ్యం తరపున, ఒక విన్నపం చేస్తున్నామని బ్రాహ్మణ కుటుంబాలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నయని ఆ సమస్యల పరిష్కారానికి మీ వంతు కృషి చేస్తారని మీ కృషి మా భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలని ఆశించారు. మరో బ్రాహ్మణ నాయకుడు రవికుమార్ మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు తక్షణమే ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని అది రుణం రూపంలో అందజేసిన స్వీకరించేందుకు బ్రాహ్మణులంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు ఈ కార్యక్రమంలో అనేక బ్రాహ్మణ సంఘాల నాయకులు బసవరాజు శ్రీనివాస్, పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్ లకు తమ కృతజ్ఞతలు అందజేశారు

# ఓర్పు ధైర్యం పట్టుదల...విజయానికి ఆయుధాలు

మనిషి జీవితం
ఆశ నిరాశల మయం
కష్టాలకు కన్నీళ్లకు
నిలయం

కష్టాలు మనిషిని
అణిచివేయడానికి రావు
అనుభవాలు పాఠాలై
గుణ పాఠాలౌతాయు
మన ఓర్పు ధైర్యాన్ని
పరీక్షించేందుకెవస్తాయి
కష్టాలు మన నైపుణ్యతను
వెలికితీస్తాయి

కొంత మంది కష్టాలను
ఎదుర్కోలేక తమ కలలను
సమాధి చేసుకుంటారు

లక్ష్య సాధనలో ఆటంకాలు
ఎదురైన ధైర్యంగా ముందుకు
సాగడమే విజేత లక్షణం

కదిలే కాలం నిన్ను వెకిరించిన
కష్టాల కడలి ఎదురొచ్చిన
కన్నీటి అలలు ముంచెత్తిన
అధైర్య పడక వెనుకడుగు
వేయకు

నీ అంతర్లీన శక్తులే నిన్ను
విజయతీరాలకు చేర్చుతాయి
నీఆశల ఆకాంక్షల దీపం
ఆరిపోనివ్వకు

సాధించాలన్న తపన
నిరంతరం రగులుతూనే
ఉండాలి

కాలం నీకు కలిసిరాక పరీక్ష
పెడితే ఓర్పు నీకు రక్షణ
కవచమై నిలువాలి
ధైర్యమే నీ ప్రగతి రథమై
ముందుకు సాగాలి

నిందలు నీ మనసును
గాయపరిస్తే మౌనమే
నీ ఆయుధం కావాలి

భయాలు నిన్ను చుట్టు
ముడితే నీమనో ధైర్యమే
నీకు తోడై దారి చూపుతుంది

అడ్డంకులు ఎన్ని వచ్చిన
సాధించాలనే సంకల్పం
పట్టుదలే నీ పెట్టుబడిగా
ప్రగతి పయనం కొనసాగించు

పట్టుదలే నీ అస్త్ర శస్త్రం కావాలి
అలసట ఆవహించిన
శ్రమిస్తూ ముందుకు సాగడమే
నీలక్ష్యం అవుతే ప్రగతి
పురోగతి సాధ్యమై అభివృద్ధి
నీ సొంతమవుతుంది

ఓర్పు సహనం పట్టుదలతో
కాలానికి ఎదురు నిలువు

ధైర్యంతో విధిని సైతం గెలువు

ఓర్పు ధైర్యం పట్టుదల
నీఆయుధాలైతే విజయం
నీసొంతమవుతుంది

చేసే పనిని మధ్యలో
వదిలేయకుండా అనుకున్న
లక్ష్యం సాధించే పోరాట తత్వం
పట్టుదల విజయ తీరాలకు
చేరుస్తుంది

ఓర్పు ధైర్యం పట్టుదల
గుణాలు మనిషిని శిఖరాగ్ర
స్థాయికి చేరుస్తాయి.



**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు తెలంగాణ**
**ఎకనామిక్ ఫోరం**
**రచయిత కాలమిస్ట్**
**కరీంనగర్**
**9440245771**

# రాజీవ్ స్ఫూర్తితో దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం......

– ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి..

సూర్యాపేట టౌన్, మే 21 (సూర్య సేన): దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. స్వర్గీయ మాజీ ప్రధాని,భారత రత్న, దివంగత నేత రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యం.డి. అంజద్ అలీ ఆధ్వర్యంలో జమ్మిగడ్డలో రాజీవ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు.

రాజ్యాంగ సవరణలు తీసుకొొచ్చి గ్రామ పంచాయతీలకే సర్వ హక్కులు, అధికారాలు కల్పించారు రాజీవ్ గాంధీ. స్థానిక సంస్థలను బలోపేతం చేశారు. దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి పేదల చేతిలో అధికారం పెట్టారు అని అన్నారు. సాంకేతిక విప్లవం తీసుకు వచ్చింది రాజీవ్ గాంధీ అని ఆయన గుర్తు చేశారు. ఐటీ రంగంలోనే కాదు,టెలికాం రంగంలోనే సమూల మార్పులు తెచ్చి మారుమూల పల్లెలకు చేర్చారు. దేశంలో యువకులకు రాజీవ్ ఒక స్ఫూర్తినిచ్చారు. దేశ సమగ్రత కోసం, సమైక్యత కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం. ఆయన జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం



ఉంది. వారి స్ఫూర్తితో మళ్లీ దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం అని తెలిపారు. యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ ది అన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సెక్యులర్ పార్టీలకు ప్రజలు అండగా నిలిచారని మత విద్వేషాలను ప్రోత్సహించే బిజెపి ప్రభుత్వానికి నరేంద్ర మోడీకి బొందపెట్టే రోజు దగ్గరలో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేష్ గౌడ్ సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాలతో పాటు పట్టణాల్లో మన ఓట్లను కాపాడుకోవాలని ఓట్లను హరించే ప్రయత్నాన్ని బిజెపి చేస్తుందని దాన్ని తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు,నాయకులకు భవిష్యత్తులో రాజకీయంగా, సామాజికంగా ఉన్నత పదవుల్లో అవకాశాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

# ధాన్యం- దైన్యం కొన్నది కొంతే.. కొనాల్సింది ఎంతో

– ఎక్కడి నిలువలు అక్కడే

**రంగారెడ్డి, మే 21 (సూర్య సేన) :** రంగారెడ్డి జిల్లాలో దాన్యం కొనుగోలు అనుకున్నంతగా జరగడం లేదు. యాసంగి పంట కొనుగోలులో భాగంగా రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 40 వేల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేయాలని పౌర సరఫరా ల శాఖ అధికారులు ఆశించిన ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఇటీవల మా ప్రతినిధి క్షేత్రస్థాయిలో పరిశీలన జరపగా ఇప్పటివరకు 8,140 మెట్రిక్ టన్నుల దాన్యం మాత్రమే సేకరించినట్లు అధికారులు తెలుపుతున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి వికారాబాద్ జిల్లాలలో అతి తక్కువ దిగుబడి దాన్యం సాగు అయ్యింది. కొద్ది పార్టీ ధాన్యం కొనుగోలు విషయంలోనే ఈ రెండు జిల్లాలు వెనకబడి ఉండడం పై రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. ఇదే అంశంపై అదరపు కలెక్టర్ చంద్రారెడ్డి మార్ఫెడ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల అదనపుకలెక్టర్ చంద్రారెడ్డి తన చాంబర్లో సమావేశం ఏర్పాటు చేశారు. మీటింగ్ కు హాజరుకాని అధికారులు గైర్హాజరైన అధికారులకు షో కాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

– సగం కూడా కాలే..

వానాకాలం నాటికి 30 వేల టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఇప్పటివరకు 1,480 టన్నులు మాత్రమే వచ్చింది యాసంగి 87344 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పది లక్షల గన్ని బ్యాగులు అవసరమని అంచనా వేసి 3.50 లక్షల గన్ని బ్యాగులు సిద్ధం చేశారు. ఇప్పటివరకు 8140 మెట్రిక్ టన్నులకు మించి ధాన్యాన్ని సేకరించలేకపోయారు.

– రెండు మిల్లులలోనే అన్లోడింగ్

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎంపిక చేసిన పది మిల్లుల కు పంపుతుండగా ఐదు చోట్ల మాత్రమే అన్లోడింగ్ జరుగుతుంది. మిగతా మిల్లులలో సామర్థ్యం లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. క్వింటాల్ ధాన్యానికి మిల్లర్లు 67 కిలోల రా రైస్ 67 కిలోల బాయిల్డ్ రైస్ ప్రభుత్వానికి అందజేయవలసి ఉంటుంది . వరికి పొట్టుదలలో నీరు అందకపోవడంతో గింజ గట్టి పడదు దీనితో నూక ఎక్కువగా వస్తూ ఉంటుంది. ఇది మిల్లర్లకు నష్టాన్ని తెచ్చిపెడుతుంది. మిల్లర్ల వద్ద ఇప్పటికే నిలువలు ఎక్కువగా ఉన్నాయి. అన్లోడింగ్ కు ఆశించిన స్థలం లేకపోవడంతో జాప్యానికి కారణం అవుతుంది. ఒకరోజు లోడుతో వెళ్లిన లారీ తిరిగి రెండు రోజుల తర్వాత మిల్లుకువస్తుంది.

– తాలు తరుగు పేరుతో నిలువు దోపిడీ

తేమ 17% తాలు మూడు శాతం మట్టి పెళ్ళలుఒక శాతం ఇతర గింజలు ఆరు శాతం మించ కూడదు అనే నిబంధనలను సాకగా చూపించి బస్తా కు రెండు కేజీలు తరుగుగా చూపించి తీసి వేస్తున్నారు. పౌర సరఫరా శాఖ అధికారులకు ఈ విషయం తెలిసిన పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

# ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ



– కూలీలతో ముచ్చటించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట మే 21 (సూర్య సేన) :** ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఆదాయ భద్రతను కల్పిస్తుందని, గ్రామీణ ప్రాంత కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరై ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు ప్రభుత్వం నిర్దేశించిన సాంకేతిక, నాణ్యత ప్రమాణాల ప్రకారం జరుగుతున్నాయా లేదా అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆయన ఆత్మకూరు మండలం లోని నెమ్మికల్ గ్రామం, మద్దిరాల మండలంలోని నూతనకల్ మరియు పోలుమల్ల గ్రామాల్లో సాగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో పనిస్థలాల్లో కూలీలకు కల్పిస్తున్న ప్రాథమిక సౌకర్యాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఎండ నుండి ఉపశమనం కోసం ఏర్పాటు చేసిన షెడ్, తాగునీరు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉంచిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆయన తనిఖీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయమే పనులు ముగించుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆదేశించారు.

కలెక్టర్ సాదాసీదాగా, స్నేహపూర్వకంగా కూలీల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు. వేతనాలు సమయానికి జమవుతున్నాయా? ప్రభుత్వం ప్రకటించిన సగటు వేతనం అందుతుందా? పనుల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కూలీలు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, ఆయన వాటిని విని, తక్షణ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తమతో అంతలా కలిసిపోవడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో వడదెబ్బ తగిలిన వారికి తక్షణ వైద్యం అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి, వైద్యుల సలహాలు పాటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సన్యాసయ అడిషనల్ పిడి చంద్రశేఖర్, ఆత్మకూరు ఎంపీడీవో హసిమ్, నూతనకల్ ఎంపీడీవో సునీత, మద్దిరాల ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి , ఏపీడి పవన్ కుమార్ స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి




**గరిడేపల్లి ప్రతినిధి, మే 21 (సూర్య సేన) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గరిడేపల్లి మండల కేంద్రంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మదర్ కమిటీలు, ఏఏపీసీ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా "బడిబాట" అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండాలని, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలలకు, ఐదో తరగతి అనంతరం ఉన్నత పాఠశాలలకు, పదో తరగతి పూర్తిచేసిన వారు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అల్పాహారం, గుడ్లు, రాగిజావ, పాలు, ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు తదితర 21 రకాల సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే పుస్తకాలు విద్యార్థులకు అందజేస్తామని పేర్కొన్నారు.

ఇదే కార్యక్రమాన్ని గడ్డిపల్లి, కీతవారిగూడెం సముదాయాల్లో కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సువర్ణ, నాగమణి, అజయ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఏపీసీ చైర్మన్లు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి రాతి గుడి నిర్మాణ కమిటీ ఎన్నిక

**గరిడేపల్లి ప్రతినిధి, మే 21 (సూర్య సేన) :** గరిడేపల్లి మండల కేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి రాతి గుడి నిర్మాణ కమిటీ అధ్యక్షునిగా గుంటూరు రామును గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులను కూడా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుంటూరు రాము మాట్లాడుతూ దేవాలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు, గ్రామానికి చెందిన ఆడబిడ్డలు అందరూ దేవాలయ నిర్మాణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుగ్రహాన్ని పొందాలని కోరారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండాది వెంకయ్య, ఉపాధ్యక్షులుగా బొబ్బ రామిరెడ్డి, కుంభం వీరయ్య, కార్యదర్శులుగా కొలిపాక రాము, మేకపోతుల పురుషోత్తం, కోశాధికారులుగా రావుల ముత్యాలు, పెండెం



ఏడుకొండలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రావుల బాలకృష్ణ, కుక్కునూరి నవీన్, సాముల జనార్దన్ రెడ్డి, కుర్ర నాగరాజు, పెండెం హేమలతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నలజాల రామారావు, గట్టికొప్పుల కృష్ణారెడ్డి తదితర భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

**నేరేడుచర్ల ప్రతినిధి, మే 21 (సూర్య సేన) :** పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" ఇంటింటి ప్రచార కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రుల సమన్వయంతో నేరేడుచర్ల మున్సిపాలిటీ ఆవాస ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో పాటు డిజిటల్ తరగతులు, గ్రంథాలయం, విజ్ఞానశాస్త్రం, కంప్యూటర్ ప్రయోగశాలలు,

అటల్ టింకరింగ్ ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు కృత్యాత్మక బోధన అందిస్తున్నామని తెలిపారు. అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని




తల్లిదండ్రులను కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి, ఆరోగ్య సహాయకులు హరికృష్ణసాగర్, ఉపాధ్యాయులు సైదులు, జానకి రాములు, నాగమణి, యాదగిరి, నరసింహారావు, వెంకట్‌రెడ్డి, బికోజి, రామ్మూర్తి, అనసూర్య, వెంకటేశ్వరరావు, లాల్‌సాహెబ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

శుక్రవారం, మే 22, 2026

# ఆమె ఆస్తి.. ఆమె ఇష్టం

ఆధునిక సమాజంలో మహిళా సాధికారతకు అసలైన అర్థం ఆమె ఆర్థిక స్వాతంత్ర్యం. భారతీయ సమాజంలో వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల ఆర్థిక ప్రయాణం కూడా. నేటి ఆధునిక కాలంలో చాలా వరకు భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నారు. ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి ఆస్తులు కొంటున్నారు. అయితే, దురదృష్టవశాత్తూ ఆ బంధం విడాకుల వరకు వెళ్తే.. మరి వారు ఇద్దరూ కలిసి కొనుగోలు చేసిన ఆస్తి ఎవరిది? అనే ప్రశ్న వివాదంగా మారుతోంది. ఇటీవల '1 ఫైనాన్స్' నిర్వహించిన అధ్యయనం ప్రకారం, విడాకులు తీసుకున్న వారిలో 67 శాతం మంది తాము విడిపోకముందే తీవ్రమైన ఆర్థిక విభేదాలు ఎదుర్కొన్నట్లు తేలింది. అంతేకాకుండా, 43 శాతం కేసుల్లో విడాకులకు ప్రధాన కారణం ఆర్థిక సమస్యలే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో వైవాహిక ఆస్తుల యాజమాన్యంపై చట్టం ఏం చెబుతోంది? ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కీలక తీర్పు ప్రాధాన్యత ఏమిటి? అనే అంశాలను చూద్దాం. టైటిల్ డీడ్ వర్సెస్ కంట్రిబ్యూషన్: చట్టం ఏం చెబుతోంది? 1955 హిందూ వివాహ చట్టం ప్రకారం, ఆస్తి ఎవరి పేరు మీద ఉంటే వారే యజమాని అనేది ప్రాథమిక సూత్రం. కేవలం పెళ్లి చేసుకున్నంత మాత్రాన భర్త ఆస్తిలో భార్యకు లేదా భార్య ఆస్తిలో భర్తకు సగం వాటా దానంతట అదే రాదు. ఇటీవల అమిష్ అగర్వాలా కేసులో తెలంగాణ హైకోర్టు ఒక స్పష్టమైన తీర్పునిచ్చింది. భర్త పేరు మీద ఉన్న నివాస ఆస్తిలో తనకూ వాటా కావాలని భార్య కోరగా కోర్టు దాన్ని తోసిపుచ్చింది. 'వివాహం జరిగినంత మాత్రాన స్థిరాస్తిపై ఉమ్మడి యాజమాన్యం ఏర్పడదు' అని కోర్టు స్పష్టం చేసింది. ఆస్తి కొనుగోలులో తమ ఆర్థిక భాగస్వామ్యం ఉందనడానికి బ్యాంకు స్టేట్‌మెంట్లు వంటి పక్కా ఆధారాలు చూపాలని న్యాయస్థానం పేర్కొంది. వినీతా సక్సేనా కేసు మినహాయింపు. సుప్రీంకోర్టు కొన్ని సందర్భాల్లో దీనిపై విభిన్నంగా స్పందించింది. వినీతా సక్సేనా వర్సెస్ పంకజ్ పండిట్ (2006) కేసులో ఆస్తి భర్త పేరు మీద ఉన్నప్పటికీ భార్యకు అనుకూలంగా తీర్పు వచ్చింది. గృహిణిగా ఆమె అందించిన సేవలు, ఇంటి నిర్వహణలో ఆమె పడిన శ్రమను 'పరోక్ష సహకారం'గా గుర్తించి హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 27 కింద ఆమెకు హక్కు కల్పించింది. నేటికీ చాలామందిలో ఆస్తి విషయంలో కొన్ని తప్పుడు అవగాహనలు ఉన్నాయి. 1 ఫైనాన్స్‌లో విల్, ఎస్టేట్ ప్లానింగ్ హెడ్ శ్రద్ధా నీలేశ్వర్ కొన్ని కీలక విషయాలను వివరించారు. తాను తెలిపిన వివరాలు కింది విధంగా ఉన్నాయి. పెళ్లయ్యాక కొన్న ఆస్తిలో భాగస్వామికి ఆటోమేటిక్‌గా 50% వాటా రాదు. 'షమీమా ఫరూకీ వర్సెస్ షాహిద్ ఖాన్ (2015)' కేసు ప్రకారం, ఆస్తిలో నివసించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప, పూర్తి యాజమాన్య హక్కులు ఉండవు. చాలామంది పన్ను ఆదా కోసం ఒకరి పేరు మీదనే ఆస్తులు కొంటారు, కానీ విడాకుల సమయంలో ఇది రెండో వ్యక్తికి చట్టపరమైన ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రస్తుతం 42 శాతం మంది పురుషులు తమ సంపాదనలో సగటున 38 శాతాన్ని భరణం లేదా వివాహ సంబంధిత రుణాలకే వెచ్చిస్తున్నారు. ఇది ఆర్థిక ప్రణాళికలో రికార్డుల ప్రాధాన్యతను చెబుతోంది. నిపుణుల సూచనలు. భవిష్యత్తులో ఆస్తి తగాదాలు తప్పించుకోవడానికి కొనుగోలు సమయంలోనే భార్యాభర్తలిద్దరి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించాలి. దీనివల్ల సెక్షన్ 80సీ, సెక్షన్ 24(ఎ) కింద ఇద్దరూ పన్ను మినహాయింపు పొందవచ్చు. డౌన్ పేమెంట్స్ లేదా ఈఎంఐలు చెల్లించినప్పుడు ఆ లావాదేవీల రికార్డులను, బ్యాంక్ స్టేట్‌మెంట్లను భద్రపరుచుకోవాలి. ఆస్తిలో ఎవరి వాటా ఎంతో దస్తావేజుల్లోనే పేర్కొనడం ఉత్తమం. వివాహం అనేది నమ్మకంతో కూడిన బంధం అయినప్పటికీ, ఆర్థిక విషయాల్లో పారదర్శకత ఉండటం నేటి కాలంలో అత్యవసరం. చట్టపరమైన చిక్కులు రాకముందే మేల్కొని ఆస్తులకు సంబంధించిన సరైన పత్రాలను సిద్ధం చేసుకోవడం ఇరు పక్షాలకు శ్రేయస్కరం. తాజాగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వెలువరించిన ఒక తీర్పు ఈ విషయాన్ని మరోసారి ఘంటాపథంగా నొక్కి చెప్పింది. "భార్యకు పుట్టింటి నుండి వచ్చిన ఆస్తిపై భర్తకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు ఉండదు" అని స్పష్టం చేస్తూ, మహిళల ఆత్మగౌరవానికి మరియు ఆస్తి హక్కులకు న్యాయస్థానం ఒక గట్టి రక్షణ కవచాన్ని నిర్మించింది. ఈ కేసులో హైకోర్టు ధర్మాసనం అత్యంత కీలకమైన అంశాలను ప్రస్తావించింది. మహిళలు తమ పుట్టింటి (తల్లిదండ్రుల) నుండి వారసత్వంగా పొందిన ఆస్తిపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటారని తేల్చి చెప్పింది. ఆ ఆస్తిని ఎవరికి ఇవ్వాలి? ఎప్పుడు అమ్మాలి? ఎవరికి బహుమతిగా ఇవ్వాలి? అనే నిర్ణయం కేవలం ఆ మహిళదే. ఈ ప్రక్రియలో భర్త అనుమతి గానీ, సమ్మతి గానీ అవసరం లేదు. వివాహం జరిగినంత మాత్రాన భార్య ఆస్తిపై భర్తకు సహజసిద్ధమైన హక్కులు లభించవు. హిందూ వారసత్వ సవరణ చట్టంలోని సెక్షన్ 15(2)(జీ) ప్రకారం, ఒక మహిళకు ఆమె పుట్టింటి నుండి వచ్చిన ఆస్తి, ఆమెకు సంతానం లేని పక్షంలో తిరిగి ఆమె తండ్రి వంశానికే చెందాలి తప్ప అత్తగారింటికి కాదు. ఈ వివాదం ఒక ఆసక్తికరమైన మలుపు నుండి మొదలైంది. ఒక మహిళ తనకు తన తల్లిదండ్రుల నుండి వచ్చిన ఆస్తిని తన మనవరాలికి ఇష్టపూర్వకంగా రాసిచ్చింది.


**సూర్యసేన**

**దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు అడ్వర్టైజ్మెంట్స్ మరియు వార్తల కోసం**

**సంప్రదించండి: 9951241048**


### జై శ్రీరామ్... జై హనుమాన్...

### భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్మించి...

## శ్రీ రామచంద్రుడి కృపా కటాక్ష వీక్షణలతో శ్రీ భక్త రామదాసు బిరుదాంకితులై...

# చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖింపబడిన మహోన్నత వ్యక్తి శ్రీ కంచెర్ల గోపన్న గారు



శ్రీ కంచెర్ల గోపన్న గారు
(శ్రీ భక్త రామ దాసు 1620 నుండి 1687 వరకు)



1620 వ సం॥ లో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గ్రామంలో లింగన్న మూర్తి, కామాంబ దంపతులకు వారు జన్మించారు. కంచెర్ల గోపన్న భార్య కమలమ్మ. వారు కూడ భర్త అడుగు జాడల్లో భక్తి మార్గంలో నడిచిన మహా సాధ్వి. శ్రీ భక్త రామదాసు (శ్రీ కంచెర్ల గోపన్న) గారి 11వ తరానికి చెందిన ఉన్నత వంశీకులు, శ్రీ కంచెర్ల వెంకట రమణ గారు.

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది" అనే నానుడిలా శ్రీ వెంకట రమణ గారికి కూడా చిన్నప్పటి నుండి భగవంతుడు, భక్తి , ధ్యానం అనే విషయాలు సహజంగానే అలవడినవి. శ్రీ భక్త రామదాసు గారి పరంపరలో శ్రీ కంచెర్ల వెంకట రమణ గారు కూడా అనంతమైన భక్తితో , ఆధ్యాత్మిక , సామాజిక సేవా భావంతో జీవితం గడుపుతున్నారు. శ్రీ రామదాసు గారు రామ భక్తులైతే, శ్రీ కంచెర్ల వెంకట రమణ గారు రామభక్తుడైన హనుమత్ ఉపాసకులు.

వారు గత పదకొండు సంవత్సరాల నుండి అందరి క్షేమం కోసం ప్రతి మంగళవారం మరియు శనివారం 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ , వివిధ దేవాలయలలో కూడా పారాయణం జరిగే విధంగా కృషి చేస్తున్నారు. లోక కళ్యాణార్ధం ప్రతి మూడు నాలుగు నెలలకు ఒకసారి లక్ష సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. అదే క్రమంలో వారు అంజనాద్రిపై గల జాపాలి హనుమత్ ఆలయంలో కూడా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం మరియు 108 ప్రదక్షణలు చేయడం జరిగింది. అక్కడ ఆంజనేయ స్వామి పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతి హిందువు ఇంటిపై హనుమంతుడి పతాకం ఎగిరే విధంగా కృషి చేస్తున్నారు. తిరుమలలోని నాద నీరాజనం మంటపంలో 380 మంది భక్తులతో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం చేయించిన దిగ్విజయ ఘనత శ్రీ కంచెర్ల వెంకట రమణ గారికే దక్కింది.

వారికి హనుమంతుడు బ్రాహ్మణ రూపంలో కనిపించి,అనుగ్రహించడంతో వారు జై శ్రీరామ్ వెంకట రమణగా ప్రాచుర్యం పొందారు. ఎక్కడ హనుమాన్ చాలీసా పారాయణం జరిగినా వీరు అక్కడ అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొనడం, జై శ్రీరామ్ – జై హనుమాన్ అనే నినాదాలతో భక్తులను ఉత్సాహ పరచడం విశేషం. వీరి కృషికి ఫలితంగా శ్రీ దైవజ్ఞ శర్మ గారి ప్రశంసా పురస్కారం లభించింది. వీరి విశేష సేవలకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ వారు శివ నంది అవార్డు తో సత్కరించారు. వి.యస్ .ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ రత్న అవార్డుతో ఘనంగా సన్మానించారు. శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి మరియు శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి వార్ల ఆధ్యాత్మిక బోధనలు, శ్రీ వెంకట రమణగారిని ఎంతగానో ప్రభావితం చేసాయి. వారి సాన్నిహిత్యంతో, ప్రేరణతో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ, విశ్వహిందూ పరిషత్ లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ ఉన్నారు.

సనాతన ధర్మ రక్షణే ధ్యేయంగా వారి గురువులు శ్రీ చాగంటి కోటేశ్వర రావుగారు, శ్రీ గరికపాటి నరసింహారావు గారు, శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రిగారు, శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గార్ల ఆశీస్సులతో వివిధ ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ, ఇతరుల చేత కూడా చేయిస్తూ, శ్రీ కంచెర్ల వెంకట రమణగారు ప్రసిద్ధి చెందారు.







అయోధ్య రామాలయ నిర్మాణ సమయంలో వారు ముందు నిలిచి దాతల సహకారంతో రెండున్నర కేజీల వెండి ఇటుకను, ఆ తరువాత ఎనిమిదిన్నర కిలోల వెండి,రెండున్నర తులాల బంగారంతో శంఖు చక్రాలు చెక్కించి దానిపై వజ్రాలతో పొదిగిన పాదుకలను శ్రీ చల్లా



పవన్ కుమార్ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా అయోధ్య రామాలయానికి పంపించారు.

గత పది సంవత్సరాలుగా భక్త రామదాసు గారి జన్మ స్థలమైన నేలకొండపల్లిలో వార్షికోత్సవంలో పాల్గొంటూ , వారి వంశీకులందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నారు. భద్రాచల రామాలయంలో , స్వామి సన్నిధిలో కంచెర్ల వంశాభి వృద్ధి కోసం అకుంటిత దీక్షతో సేవలందిస్తున్నారు.



ప్రతి సంవత్సరం శ్రీ రామదాసు గారి జయంతి ఉత్సవాలు మరియు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భద్రాచలంలో మరియు నేలకొండ పల్లిలో వారి తాతగారైన శ్రీ కంచెర్ల గోపన్న (శ్రీ భక్త రామదాసు) గారి జ్ఞపకార్థం సత్రం నిర్మించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారు. శ్రీ కంచెర్ల వెంకట రమణ గారు, రూపంలో, ఆహార్యంలో, భక్తి భావంలో శ్రీ భక్త రామదాసు గారిని పోలి ఉండడం , వారి పరంపరలోనే ఆధ్యాత్మిక ప్రయాణం కొనసాగించడం విశేషం. శ్రీ వెంకట రమణగారు, ప్రతి ఒక్కరిని ఆత్మీయతతో పలకరించడం, స్నేహ భావంతో ఉండడం వలన వారంటే అందరికి ప్రత్యేక అభిమానం. శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆశీస్సులతో వారి సంకల్పం నెరవేరాలని, వారి ఆధ్యాత్మిక ప్రయాణం నిరంతరం కొనసాగాలని, వారి సన్నిహితులు, మిత్రులు శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు.

**"లోకా సమస్తా సుఖినో భవంతు"**

# ధరణి గుండెల్ని చీల్చేస్తూ......



పచ్చదనమంతా
వెలిసిపోయింది

కత్తులు దూస్తున్నట్లుగా
వీస్తోంది కటిక వేడిగాలి
నిప్పు గొడుగు కింద జీవం
ఊపిరి కోసం పోరాడుతోంది
కాలం పెట్టే ఈ అగ్ని పరీక్ష కు
రేపటిని శాసిస్తూ
సృష్టి సాగుతోంది
వర్షపు చినుకు కై ఎదురు చూస్తూ
కొత్త జీవన రాగాన్ని ఆలాపిస్తూ -

పడింది సూర్యుడి తొలి అడుగు
ఆకాశపు నడిబొడ్డున
విచ్చుకుంది నిప్పు గొడుగు

అగ్ని బాణాలకు
నదీ చైతన్యం ఆగిపోయింది

**ఇట్లు**
**మండాది గోపీనాథ్**
**ముక్కుడు దేవులపల్లి గ్రామం**
**ఇస్తాళాపురం పోస్ట్**
**ఆత్మకూరు - ఎా మండలం**
**సూర్యాపేట జిల్లా - 508221**

# రేపు జిల్లా స్థాయి "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం



**నల్గొండ, మే 21 (సూర్య సేన) :** ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల 22న నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 22న జిల్లా కేంద్రంలో సమీపంలోని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి ప్రజా పాలన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులతో పాటు, జిల్లా ఇన్చార్జి మంత్రి, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.
జిల్లా స్థాయి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ,ముఖ్యంగా ప్రజాప్రతినిధులను కార్యక్రమానికి ఆహ్వానించడం, స్టేజి ఎల్ఈడి ల ఏర్పాటు, అలాగే కార్యక్రమానికి హాజరయ్యేవారందరికీ తాగునీరు,
ఇతర ఏర్పాట్లు చేయాలని, ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఆయా శాఖల ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమాల పై టేబుల్ బుక్స్, బుక్లెట్లు తయారు చేయాలని, అంతేగాక వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రాధామ్య పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా అధికారులు వారి సిబ్బందితో సహా కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు.

# రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా అధికారులు దృష్టి సారించాలి...





**నల్గొండ, మే 21 (సూర్య సేన) :**
ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయాదిత్య భవన్లో డీఆర్డీఏ, ఐకేపీ, పీఏసీఎస్ ఏజెన్సీల ప్రతినిధులు, ట్యాబ్ ఆపరేటర్లు, ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈవోలు, మండల వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలను పూర్తిచేసి రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. మిల్లర్లు ట్రక్ సీట్లు త్వరితగతిన ఇవ్వాలని, ధాన్యం నిల్వలు ఎక్కువ కాలం కొనుగోలు కేంద్రాల్లో ఉండకుండా వెంటనే తరలింపు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.
ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిసిఓ పత్యానాయక్, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాలు అరికట్టాలి బాలికల హక్కులను కాపాడాలి...




**- ఎయిడ్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వగ్గు సోమన్న**

**పెన్ పహాడ్, మే 21 (సూర్య సేన) :** బాల్యవివాహాలు అరికట్టి బాలికల హక్కులను కాపాడాలని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ వగ్గు సోమన్న తెలిపారు మండల పరిధిలోని దోస పహాడ్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు బాల్యవివాహాల నిర్మూలన బాలల చట్టాలపై చట్టాలపై యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు .సందర్భంగా ఆయన మాట్లాడుతూ.
బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలలోపు అబ్బాయికి 21 సంవత్సరాలలోపు పెళ్లిలు చేస్తే చట్టప్రకారం నేరం అన్నారు. పెళ్లిళ్లు పాల్గొన్న పురోహితులకు పాస్టర్లకు కాజాలకు మత పెద్దలకు చట్ట ప్రకారం శిక్షకు పాత్రులు అవుతారన్నారు. మైనర్ బాలిక పెళ్లిళ్లు చేస్తున్నట్టు ముందస్తు సమాచారం తెలిస్తే వెంటనే 1098, 100 కు సమాచారం అందించాలని తెలిపారు..పిల్లల హక్కులను కాపాడి వారి బంగారు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జానీ టెక్నికల్ అసిస్టెంట్ బుచ్చన్న, ఫీల్డ్ అసిస్టెంట్ కొండేటి వెంకటేష్ , ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి కార్యక్రమం



**- హాజరుకానున్న మంత్రులు,**
**స్థానిక ప్రజా ప్రతినిధులు**

**సూర్యాపేట మే 21 (సూర్య సేన) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజులు "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రకటనలో తెలిపారు. స్థానిక రవిమహల్ ఫంక్షన్ హాల్ వేదికగా ఉదయం 10 గంటల నుండి ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మరియు ఎస్సీ ,ఎస్టీ మైనార్టీ,వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొననున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ముఖ్యంగా కొత్త పథకాలపై సమగ్ర విశ్లేషణ, వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని సాధించిన విజయాలు, రాబోయే కొత్త పథకాలపై వివరాలను వెల్లడిస్తారన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రెవెన్యూ , విద్యా, విద్యుత్, పౌరసరఫరాల శాఖలపై సమీక్షి సమావేశంలో అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# భారత జనగణన ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, మే 21 (సూర్య సేన) :** భారత జనగణన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన భారత జనగణన ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రజల వివరాలు సక్రమంగా నమోదు కావడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడు తాయని తెలిపారు. భారత జనగణన ప్రచార రథం సూర్యాపేట జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రజలకు జనగణన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనుందని కలెక్టర్ వివరించారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సిబ్బందికి నిజాయితీగా, పూర్తి స్థాయిలో అందించాలని సూచించారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్న ఆయన, జనగణన సిబ్బంది ఇంటింటికీ వచ్చినప్పుడు పూర్తి వివరాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జనాభా, కుటుంబ సభ్యుల వివరాలు, వంటి సమాచారం ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఓ కిషన్, దున్న శ్యాం, మధు, ఫీల్డ్ ట్రైనర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశం




**- ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి**
**- కేసుల దర్యాప్తులో నైపుణ్యం తో పని పని చేయాలి**
**- అక్రమ రవాణా, అసాంఘిక చర్యల పై పటిష్ట నిఘా**
**- ప్రజల భద్రత కోసమే నిత్యం తనిఖీ.**
**- జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్**

జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ గురువారం జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యంతో పనిచేయాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసు సేవలను వేగంగా అందించాలని కోరారు. కేసులు పెండింగ్ లేకుండా పనిచేయాలని తెలిపారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు. బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు చేసే విషయంలో అలసత్వం వహించకూడదని డోర్ స్టెప్ ఎఫ్ఐర్ పటిష్టంగా అమలుకోవాలని సూచించారు. సమీక్షలో భాగంగా నేరాల నమోదు, పెండింగ్ కేసులు, కోర్టు మానిటరింగ్, శిక్షలు అమలు, డయల్ 100 కాల్స్, బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు, ప్రజా ఫిర్యాదుల పై స్పందన, వాహనాల తనిఖీ, అనుమానిత వ్యక్తుల కదలికలు, రౌడి షిటర్స్ పై నిఘా, రోడ్డు ప్రమాదాల నిర్మూలన, సైబర్ మోసాల్లో నగదు రిఫండ్, దొంగతనాల కేసుల్లో కేసుల డిటెక్షన్ మొదలగు అంశాలను సమీక్షించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. సైబర్ మోసాలపై, మహిళా భద్రతపై అవగాహన కల్పించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, అక్రమ రవాణా నివారణకు నిత్యం తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట డి.ఎస్ ప్రసన్నకుమార్, డిసిఆర్బి డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మాగ్దూమ్ అలి, సీఐ లు వెంకటయ్య, రాజశేఖర్, నాగేశ్వరరావు, రామకృష్ణా రెడ్డి, శివ శంకర్, చరమందరాజు, ఎస్సై లు, సిబ్బంది ఉన్నారు.



# జలగం జనార్ధన్‌కు ఘన నివాళులు...

**గరిడేపల్లి ప్రతినిధి, మే 21 (సూర్య సేన) :** సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ జలగం జనార్ధన్ (జన్నుసార్) ఐదో వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన విప్లవ నాయకుడు జలగం జనార్ధన్ అని కొనియాడారు. దోపిడీ, పీడన, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి భూస్వాముల ఆగడాలను అరికట్టేందుకు పోరాటాలు సాగించారని గుర్తుచేశారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ఉద్యమ బాటలో వెనుకడుగు వేయలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జలగం జనార్ధన్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చనగాని సాంబయ్య, గండు నాగేష్, చనగాని లక్ష్మయ్య, గండు మల్లయ్య, కొల్ల శ్రీను, పోటు శ్రీహరి, సువార్త, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# చెంచలను పరామర్శించిన ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**భానుపురి, మే 21 (సూర్య సేన) :** ప్రమాదవశాత్తు గాయపడి జమ్మిగడ్డ హెల్తీ ఫై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెంచల శ్రీనివాస్ ని పరామర్శించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి వారి వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి
అంజద్ అలి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దెబోయిన శ్రీనివాస్, పడిదల రవి, నాగు నాయక్ తదితరులు ఉన్నారు.



# ఎండ తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌లి



TELANGANA DEVELOPMENT PLANNING SOCIETY
PLANNING DEPARTMENT, GOVERNMENT OF TELANGANA
TGDPS

Automatic Weather Stations( 20/05/2026 08:30AM to 21/05/2026 08:30AM )

Maximum Temperature Color Codes

| >=45 | >40 to <45 | >=35 to <=40 | <35 |
|---|---|---|---|
| Warning | Alert | Watch | No Warning |

| Aws_Id | Location | Mandal | Rainfall (mm) | Temperature(°C) Min | Temperature(°C) Max |
|---|---|---|---|---|---|
| 10691 | Mellachervu | Mellachervu | 0.0 | 32.5 | 46.2 |
| 10700 | Garidepalle | Garidepalle | 0.0 | 30.2 | 46.1 |
| 11581 | Urlugunda | Mothey | 0.0 | 30.3 | 46.1 |
| 30073 | Mukundapuram | Maddirala | 0.0 | 29.9 | 46.1 |
| 20012 | Reddiguda | Maddirala | 0.0 | 30.1 | 46.1 |
| 10690 | Mamillagudem | Mothey | 0.0 | 34.2 | 46.0 |
| 10689 | Munagala | Munagala | 0.0 | 31.9 | 46.0 |
| 10704 | Chilkur | Chilkur | 0.0 | 31.9 | 45.9 |
| 10682 | Nuthankal | Nuthankal | 0.0 | 30.2 | 45.8 |
| 10680 | Penpahad | Penpahad | 0.0 | 31.0 | 45.5 |
| 10677 | Thirumalagiri | Thirumalagiri | 0.0 | 31.2 | 45.5 |
| 10687 | Nadigudem | Nadigudem | 0.0 | 32.8 | 45.3 |
| 11588 | Cheedella | Penpahad | 0.0 | 31.6 | 45.2 |
| 11579 | Raghunadhapalem | Mattampalle | 0.0 | 31.8 | 45.2 |
| 10547 | Lakkavaram Road( ESS Huzur Nagar) | Huzurnagar | 0.0 | 32.4 | 45.2 |
| 11124 | Peddaveedu | Mattampalle | 0.0 | 30.9 | 45.2 |
| 11573 | Thirumalagiri | Chivvemla | 0.0 | 31.5 | 45.2 |
| 11593 | Tekumatla | Suryapet | 0.0 | 29.5 | 45.2 |
| 10696 | Arvapalli H/o Jajireddigudem | Jajireddigudem | 0.0 | 31.6 | 45.1 |
| 10184 | Mattampalle | Mattampalle | 0.0 | 30.8 | 45.1 |
| 10188 | Shantinagar H/o Ananthagiri | Ananthagiri | 0.0 | 30.7 | 45.0 |
| 11578 | Thogarrai | Kodad | 0.0 | 31.4 | 45.0 |
| 10683 | Narsaiahgudem H/o Dirsencherla | Neredcherla | 0.0 | 32.1 | 44.9 |
| 10093 | Balaram Thanda H/o Suryapet | Suryapet | 0.0 | 31.2 | 44.7 |
| 11587 | Alangapuram | Palakeedu | 0.0 | 31.2 | 44.7 |
| 10086 | Thungathurthi | Thungathurthi | 0.0 | 31.7 | 44.6 |
| 11602 | Yerkaram | Suryapet | 0.0 | 30.7 | 44.6 |
| 11601 | Gaddipalle (ARS) | Garidepalle | 0.0 | 31.1 | 44.5 |
| 20013 | Nagaram | Nagaram | 0.0 | 31.3 | 44.4 |
| 10709 | Atmakur | Atmakur_S | 0.0 | 31.3 | 44.3 |
| 11577 | Gondriyala | Ananthagiri | 0.0 | 30.4 | 44.3 |
| 11580 | Donda Padu | Chinthala Palem | 0.0 | 31.2 | 44.3 |
| 30084 | Phanigiri | Nagaram | 0.0 | 31.6 | 44.2 |
| 10702 | Chendupatla | Chivvemla | 0.0 | 30.9 | 44.2 |
| 11570 | Keethavarigudem H/o Raini Gudem | Garidepalle | 0.0 | 30.6 | 44.2 |
| 11899 | Mukundharpuram | Neredcherla | 0.0 | 30.8 | 44.1 |



**సూర్యాపేట, మే 21 (సూర్య సేన) :** జిల్లాలో నాలుగు రోజుల పాటు ఎండ తీవ్రత మరియు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.

మధ్యాహ్నం బయటకు రావద్దు: ఉదయం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదని తెలిపారు.

**ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి:**

దాహం వేయకపోయినా సరే తరచూ నీరు తాగుతుండాలి. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ లవణాల మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చు. దుస్తుల ఎంపిక: బయటకు వెళ్లేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలి. తలకు టోపీ, రుమాలు లేదా గొడుగు తప్పనిసరిగా ఉపయోగించాలి. కంట్రోల్ రూమ్ నెంబర్ 6281492368 కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేయనైనది

# అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు వడగాల్పులపై ప్రజలకు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సూచన



గరిడేపల్లి ప్రతినిధి, మే 21 (సూర్య సేన): మండలంలో తీవ్ర ఎండలు, వడగాల్పులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ గురువారం సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప మధ్యాహ్న సమయంలో బయటికి రావద్దని తెలిపారు.

ప్రజలు తరచూ నీరు తాగుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్సై తెలిపారు.

# ఘనంగా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు యేసయ్య మ్యారేజ్ డే





**కోదాడ టౌన్, మే 21 (సూర్య సేన) :** స్థానిక నయానగర్ బాప్టిస్ట్ చర్చి ఆవరణములో కోదాడ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ నాయకులు ఒంటెపాక యేసయ్య మ్యారేజ్ డే సందర్భంగా కోదాడ నియోజకవర్గం అధ్యక్షులు రామారావు వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, సేవాభారత్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎనోష్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్ నియోజకవర్గం నాయకులు చారి పాల్ యూత్ ప్రెసిడెంట్ సురేష్ అనితగిరి మండల ప్రెసిడెంట్ రాజేష్ సెక్రెటరీ శామ్యూల్ సీనియర్ పాస్టర్ ప్రసాద్ గిరిజన టీచర్స్ నాయకులు జగ్గు నాయక్ తదితరులు వివాహ శుభాకాంక్షలు తెలిపారు

# రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**హుజూర్‌నగర్ ప్రతినిధి, మే 21 (సూర్య సేన) :** హుజూర్‌నగర్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీవర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లి రవి మాట్లాడుతూ దేశంలో సమాచార సాంకేతిక, దూరసంప్రేక్షణ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ వేసిన పునాదులు చిరస్మరణీయమన్నారు. కంప్యూటర్ యుగానికి శ్రీకారం చుట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ యువతకు రాజకీయ సాధికారత కల్పించేందుకు ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు.

అలాగే మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కలల ప్రాజెక్టుగా హుజూర్‌నగర్‌లోని రామస్వామిగుట్ట వద్ద నిర్మిస్తున్న 2160 ఒక్క పడకగది ఇళ్లకు రాజీవ్ గాంధీ పేరు పెట్టడం హర్షణీయమన్నారు. వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ రావు మాట్లాడుతూ గ్రామీణ పాలన బలోపేతానికి, స్థానిక సంస్థల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి తదితరులు మాట్లాడుతూ నవోదయ విద్యాలయాల ఏర్పాటు ద్వారా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూమా మౌనికకు దారేది...



**కర్నూలు,** మే 21 (సూర్య సేన):భూమా మౌనిక రెడ్డి రాజకీయ అరంగేట్రం ఖాయం అని తేలిపోయింది. ఈ విషయాన్ని స్వయంగా సినీ నటుడు ఆమె భర్త మంచు మనోజ్ వెల్లడించారు. భూమా మౌనికా రెడ్డికి రాజకీయాలు కొత్త కాదని ఆయన చెప్పుకొచ్చారు. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి వారసురాలిగా ఆమె భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టబోతున్నారు అని మనోజ్ సంచలన ప్రకటన చేశారు. దీంతో రాయల సీమ రాజకీయాలతో పాటు కర్నూల్ ఆళ్ళ రాజకీయాల్లో కొత్త చర్చ వేడిగా వాడిగా రాజుకుంటోందివిషయానికి వస్తే భూమా కుటుంబానికి కర్నూలు జిల్లాలో ఎంతటి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయో అందరికీ తెలిసిందే. రాజకీయంగా ఆ కుటుంబం జిల్లాలో కీలక పాత్ర పోషించింది. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి దంపతులు రాజకీయాల్లో తమదైన శైలిలో ప్రాధాన్యతతో కూడిన పాత్ర పోషించారు. వారు దివంగతులు కావడంతో ఆ కుటుంబంలో బిడ్డలు ఇపుడు రాజకీయంగా తమ అవకాశాల కోసం ఎవరి ప్రయత్నాలలో వారు ఉన్నారు. ఇప్పటికే భూమా నాగిరెడ్డి దంపతుల రాజకీయ వారసురాలిగా రంగ ప్రవేశం చేసిన అఖిల ప్రియ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు..గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి కూడా అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆళ్ళగడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున ఉంటూ గట్టి పట్టు సాధించారుఇదిలా ఉంటే భూమా నాగిరెడ్డి దంపతుల రెండవ కుమార్తె మౌనిక రెడ్డి ఇప్పుడు రాజకీయాల వైపు చాలా ఆసక్తిగా చూస్తున్నారు అని అంటున్నారు. మంచు మనోజ్ ఈ విషయాని ధృవీకరించడంతో పాటు మౌనికా రెడ్డిది రాజకీయ కుటుంబమే అని స్పష్టం చేయడంతో భూమా మౌనిక రెడ్డి రాజకీయానికి తెర లేచినట్లు అయింది. భూమా కుటుంబంలో ఇద్దరు ఆడబిడ్డలు ఒక సోదరుడు రాజకీయ వారసత్వం విషయంలో పోటీ పడే పరిస్థితి వచ్చిందా అన్న చర్చ కూడా ఉంది. అయితే అఖిలప్రియకు గతంలో మౌనికా రెడ్డి రాజకీయంగా అండగా నిలిచి ఆమె విజయం వెనక ఉన్నారు. ఇక వారి సోదరుడు జగద్విఖ్యాత రెడ్డి కూడా అఖిలప్రియ వెంట ఉన్నారు. మౌనికా రెడ్డి రాజకీయాల్లోకి వస్తే ఆమె దారి ఏ వైపు అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఇక భూమా మౌనిక రెడ్డి రాజకీయంగా తన సొంత దారిలో వెళ్తారా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఆమెకు మంచు మనోజ్ పూర్తి మద్దతుగా నిలుస్తారని చెబుతున్నారు. ఇప్పటికే సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ దంపతులు ప్రజల మన్నన పొందుతున్నారు. రాజకీయాలు పట్ల ఆసక్తి కూడా ఉన్నట్లుగా ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. మంచు మనోజ్ తన పుట్టినరోజు సందర్భంగా తన సతీమణి రాజకీయ రంగ ప్రవేశం మీద తాజాగా కీలక వ్యాఖ్యలే చేశారు. దాంతో ఆమె ఎక్కడి నుంచి పోటీ చేస్తారు, ఏది పార్టీ నుంచి చేస్తారు, ఎంపీగానా లేక ఎమ్మెల్యేగానా ఇవన్నీ చర్చకు దారి తీస్తున్నాయిఇక భూమా కుటుంబానికి తెలుగుదేశం పార్టీతోనూ వైసిపితోనూ ప్రజా రాజ్యంతోనూ సంబంధాలు ఉన్నాయి. భూమా దంపతులు ఈ మూడు పార్టీల నుంచి ప్రజా ప్రతినిదులు అయ్యారు. దాంతో తెలుగుదేశంలో అక్క అఖిలప్రియ రాజకీయంగా స్థిరపడినందున మౌనికా రెడ్డి వేరే ప్రత్యామ్నాయలు చూసుకుంటారా అన్న చర్చ కూడా సాగుతోంది.

# కుర్చీ మడతపెట్టి ఫేమ్ మహమ్మద్ పాషా కన్నుమూత



రంగారెడ్డి, మే 21 (సూర్య సేన): "కుర్చీ మడత పెట్టి" డైలాగుతో సోషల్ మీడియాలో విపరీతమైన గుర్తింపు తెచ్చుకున్న మహమ్మద్ పాషా అలియాస్ కుర్చీ తాత హఠాన్మరణం చెందారు. నగరంలోని కృష్ణకాంత్ పార్క్ లో ఉదయం వాకింగ్ చేస్తుండగా ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయినట్లు సమాచారం. స్థానికులు వెంటనే స్పందించి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్త తెలిసిన వెంటనే సోషల్ మీడియాలో విషాద సందేశాలు వెల్లువెత్తాయి. సాధారణ వ్యక్తిగా ఉన్న మహమ్మద్ పాషా కుర్చీ మడతపెట్టి అనే ఒక డైలాగ్ తో సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాడు. మీమ్స్ వీడియోలు ద్వారా ఆయన ప్రత్యేక గుర్తింపు లభించింది. ఎంతో మంది యువత ఆయనను ప్రేమగా కుర్చీ తాత అని పిలుచుకునేవారు. మహమ్మద్ పాషా ఆకస్మిక మృతి పట్ల అభిమానులు నేటిజనులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఆయన వీడియోలను షేర్ చేస్తూ నివాళి అర్పిస్తున్నారు.

# పాట ప్రజా చైతన్యానికి పదునైన ఆయుధం



నేరేడుచర్ల ప్రతినిధి, మే 21 (సూర్య సేన): పాటను ప్రజా చైతన్యానికి పదునైన బాణంగా మలిచింది ప్రజానాట్య మండలేనని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాస్ అన్నారు. గురువారం నేరేడుచర్లలో నిర్వహించిన ప్రజానాట్య మండలి జిల్లా నాలుగో మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళ ప్రతి మనిషి జీవితంలో అంతర్భాగమని, జోలపాట నుంచి అంతిమయాత్ర వరకు పాట మనిషి జీవితంతో ముడిపడి ఉంటుందన్నారు. ప్రజా ఉద్యమాల విజయవంతంలో పాట పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. కళలను సమాజ హితానికి ఉపయోగించాలని, అసాంఘిక దృశ్యాలు, అశ్లీలత యువతను చెడు మార్గంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర ప్రసారాలను నియంత్రించాలని, సెల్‌ఫోన్లలో కూడా నియంత్రణ వ్యవస్థ అవసరమని డిమాండ్ చేశారు. మహాసభకు దొంతగాని సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ధూళిపాళ ధనుంజయనాయుడు, యుల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలతోనే జగన్ ఫేస్ టూ ఫేస్

**విజయవాడ,** మే 21 (సూర్య సేన):వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎందుకు ఓటమి పాలు అయ్యామో గురించించారు. పార్టీని సొంతం అనుకుని తమ ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా 2019 ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు 2024 నాటికి పూర్తిగా గాలికి వదిలేశారు అన్నది బాగా ప్రచారంలో ఉంది. అందులో నిజం ఉందని వైసీపీ హైకమాండ్ కూడా భావిస్తోంది. అందుకే జగన్ కార్యకర్తలకు వైసీపీ 2.0 ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని ఇప్పటిదాకా చెబుతూ వస్తున్నారు. ఇపుడు ఆయన నేరుగా ప్రతీ నియోజకవర్గంలోని కార్యకర్తలతో నేరుగా భేటీ వేస్తారు అని ప్రచారం సాగుతోంది. అది ఎపుడూ ఏమిటి అన్నది తెలియదు కానీ కార్యకర్తలతో అధినేత ముఖా ముఖీ సమావేశం అవుతారు అని అంటున్నారు. వైసీపీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంచార్జిలను నియమించింది. అక్కడ నుంచి మునిసిపాలిటీలు, మండలాలు, గ్రామాలు వార్డులు ఇలా బూత్ లెవెల్ దాకా కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ ఆదేశించింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ అయితే జోరుగా సాగుతోంది అని అంటున్నారు.




# జిల్లా కేంద్రంలో డాగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

**– గంజాయి లాంటి మాదకద్రవ్యాలు,మత్తు పదార్థాల, నిర్మూలన**

**– గుర్తింపు లక్ష్యంగా తనిఖీలు నిర్వహించిన నార్కోటిక్ డాగ్**

**సూర్యాపేట, మే 21 (సూర్య సేన) :** సమాజంలో గాంజా ఇలాంటి మాదకద్రవ్యాన్ని నిర్మూలించడం లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుంది దీనిలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో టీ స్టాల్స్, పాన్ షాప్స్, రోడ్డు వెంట ఉన్న హోటల్స్, బస్టాండ్ షాపింగ్ మాల్స్ నందు నార్కోటిక్ డాగ్ తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సూర్యాపేట పట్టణ పోలీసులు డాగ్ స్క్వాడ్ సిబ్బంది తనికిల్లో పాల్గొన్నారు.



# రూ.5 లక్షల లోపు అధిక మైలేజీ ఇచ్చే కార్లు...

ఇటీవల భారత్ లో పెట్రోల్ ధరలు మరోసారి పెరిగాయి. దీంతో ఇప్పుడు సామాన్యుల జేబులపై నేరుగా ప్రభావం చూపుతోంది. రోజూ ఆఫీసుకు వెళ్లేవారైనా, వ్యాపార నిమిత్తం సుదూర ప్రయాణాలు చేసేవారైనా, ప్రతి ఒక్కరి నెలవారీ ఇంధన బడ్జెట్ క్షీణిస్తున్నట్లు కనిపిస్తోంది.

ఈ సమయంలో చాలామంది అధిక మైలేజీనిచ్చే కార్ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా, రూ.5 లక్షల లోపు ధర ఉన్నవి! ఈ కార్లు తక్కువ ఇంధన వినియోగంతో సుదూర ప్రయాణాలకు వీలు కల్పిస్తాయి. వీటి మెయింటనెన్స్ కూడా చవకైనదే. ఈ నేపథ్యంలో అద్భుతమైన మైలేజీనిచ్చే బడ్జెట్ కార్లు ఏమిటో తెలుసుకుందాం.

రూ.5 లక్షల బడ్జెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కార్ల జాబితాలో మారుతి ఆల్టో కె10 అగ్రస్థానంలో ఉంది. ఈ కారు సుమారుగా 24.39 నుండి 24.9 కి.మీ/లీ మైలేజీని అందిస్తుంది. సరసమైన కారు కోసం చూస్తున్న వారికి దీని ధర చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. మారుతి ఎస్-ప్రెస్సో ఈ విభాగంలో మారుతి ఎస్-ప్రెస్సో కూడా ఉంది. ఈ కారు 24.12 నుండి 25.3 కి.మీ/లీ మైలేజీని అందిస్తుంది. దీని కారణంగానే చాలా ప్రజాదరణ పొందింది.

రెనాల్ట్ క్విడ్ కూడా సుమారుగా 21.46 నుండి 22.3 కి.మీ/లీ మైలేజీని ఇస్తుంది. ఈ కార్లలోని చిన్న ఇంజన్లు పెట్రోల్ వినియోగాన్ని తగ్గిస్తాయి. నగర డ్రైవింగ్‌ను సులభతరం చేస్తాయి. మారుతి సెలెరియో ఈ విభాగంలో మారుతి సెలెరియో కూడా ఒక బలమైన పోటీదారుగా ఉంది. ఈ వాహనం 24.97 నుండి 26.68 కి.మీ/లీ అద్భుతమైన ఇంధన సామర్థ్యాన్ని ఇస్తుందని, నగరంతో పాటు హైవే డ్రైవింగ్‌లో కూడా బాగా పనిచేస్తుందని కంపెనీ పేర్కొంది.



## బీఎస్ఎన్ఎల్ ఆల్ రౌండర్ ప్లాన్ ఇదే.. ఎన్ని ప్రయోజనాలో!




ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ రూ.599 ప్రీపెయిడ్ ప్లాన్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఇది కొత్త ప్లాన్ కానప్పటికీ, కంపెనీ ఇటీవల తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో దీనిని తిరిగి ప్రచారం చేసింది. బీఎస్ఎన్ఎల్ తన అధికారిక ఎక్స్ అకౌంట్‌లో ఈ ప్లాన్ గురించిన సమాచారాన్ని పంచుకుంటూ..దాని సుదీర్ఘ వ్యాలిడిటీ , అధిక డేటా ప్రయోజనాలను హైలైట్ చేసింది. ఈ నేపథ్యంలో మీరు బీఎస్ఎన్ఎల్ యూజర్ అయ్యి ఉండి సుదీర్ఘ వ్యాలిడిటీతో కూడిన అద్భుతమైన రీఛార్జ్ ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే, ఇది బెస్ట్ ఆప్షన్ కావచ్చు.

బీఎస్ఎన్ఎల్ రూ.599 ప్రీపెయిడ్ ప్లాన్ బీఎస్ఎన్ఎల్ రూ.599 ప్రీపెయిడ్ ప్లాన్ వినియోగదారులకు రోజుకు 3+దీ హై-స్పీడ్ డేటాను అందిస్తుంది. ఇది అన్ని నెట్‌వర్క్‌లలో అపరిమిత వాయిస్ కాలింగ్‌ను కూడా అందిస్తుంది. ఈ ప్లాన్ రోజుకు 100 ూమీూలను సైతం అందిస్తుంది. ఈ ప్లాన్ అతిపెద్ద ప్రత్యేకత దాని 70-రోజుల వ్యాలిడిటీ! దీనివల్ల దీర్ఘకాలిక రీఛార్జ్‌ల అవసరం ఉండదు. నిజానికి, ఈ ప్లాన్ వినియోగదారులకు దాని మొత్తం వ్యాలిడిటీ కాలానికి సుమారుగా 210+దీ డేటాను అందిస్తుంది. అంతేకాకుండా, రోజువారీ డేటా పరిమితికి చేరుకున్న తర్వాత కూడా ఇంటర్నెట్ పూర్తిగా డిస్‌కనెక్ట్ అవ్వదు. హై-స్పీడ్ డేటా అయిపోయిన తర్వాత, వేగం 40 ెఎజూంకి తగ్గుతుందని, తద్వారా ప్రాథమిక ఇంటర్నెట్ వాడకాన్ని కొనసాగించడానికి వీలవుతుందని కంపెనీ పేర్కొంది. ఈ ప్లాన్ ఏ యూజర్లకు బెస్ట్?

ఈ బీఎస్ఎన్ఎల్ ప్లాన్ ముఖ్యంగా ఎక్కువ ఇంటర్నెట్ డేటా అవసరమయ్యే వారికి అనువైనది. ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్, సోషల్ మీడియా, వీడియో కాలింగ్, వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే వినియోగదారులకు ఈ ప్లాన్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాకుండా, ఈ ప్లాన్ దీర్ఘకాలిక వ్యాలిడిటీని అందిస్తుంది. దీనివల్ల తరచుగా రీఛార్జ్ చేయవలసిన ఇబ్బంది తగ్గుతుంది.

## మహీంద్రా కార్లపై అదిరిపోయే ఆఫర్లు...



దేశంలోని ప్రముఖ వాహన తయారీ సంస్థలలో ఒకటైన మహీంద్రా ఎలక్ట్రిక్ విభాగంలో అనేక వాహనాలను విక్రయిస్తోంది.

నివేదికల ప్రకారం..ఈ నెలలో ఈ సంస్థ అందిస్తున్న అనేక ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలను కొనుగోలు చేయడం ద్వారా లక్షల రూపాయల వరకు ఆదా చేయవచ్చు. ఈ నెలలో సంస్థ అందిస్తున్న ప్రతి వాహనంపై ఎంత ఆదా చేయవచ్చనే ఇప్పుడు తెలుసుకుందాం.

మహీంద్రా శఖు 400 మహీంద్రా భారత మార్కెట్లో శఖు 400ను అందిస్తోంది. ఈ నెలలో ఈ ఎస్‌యూవీ కొనుగోలు చేయడం ద్వారా అత్యధిక ఆదాను పొందవచ్చు. నివేదికల ప్రకారం..ఈ నెలలో తయారీదారు ఈ ఎస్‌యూవీ పై రూ. 2.5 లక్షల వరకు తగ్గింపును అందిస్తోంది. ఈ ఆఫర్లు నగదు తగ్గింపుల రూపంలో ఉన్నాయి.

మహీంద్రా దీజు6 మహీంద్రా ఈ నెలలో దీజు6 ఎస్‌యూవీ పై రూ.2 లక్షల వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని అందిస్తోంది. తయారీదారు ఈ అవకాశాన్ని నగదు తగ్గింపు రూపంలో అందిస్తున్నట్లు సమాచారం. మహీంద్రా శజుఎ 9వ మహీంద్రా భారత మార్కెట్లో శజుఎ 9వ ని కూడా అందిస్తోంది. ఈ నెలలో ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ పై తయారీదారు రూ.1.40 లక్షల వరకు ఆదాను అందిస్తోంది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు...



డాలర్ విలువ బలపడటంతో మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర 21,600 రూపాయలు తగ్గగా, 10 గ్రాముల బంగారం ధర 3,200 రూపాయలు తగ్గింది. దీంతో కిలో వెండి రూ.2.75 లక్షలు, 10 గ్రాములు బంగారం ధర రూ.1.62 లక్షలకు దిగొచ్చింది. అంతర్జాతీయ పరిణామాల వల్ల ఈ మార్పు వచ్చినట్లు నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు డాలర్ వైపు మొగ్గు చూపడంతో ఆభరణాల ధరలు భారీగా క్షీణించాయి.

## కేవలం రూ.199కే 28 రోజుల వ్యాలిడిటీ!




చాలామంది రీఛార్జ్ ప్లాన్స్ ఖరీదైనవిగా మారుతున్న క్రమంలో సరసమైన ప్లాన్‌ల కోసం చూస్తున్నారు. ఎయిర్‌టెల్ సిమ్ ఉపయోగిస్తుంటే, మీకో గుడ్ న్యూస్! కేవలం రూ.200 ధర లోపు 28 రోజుల వ్యాలిడిటీతో ఒక గొప్ప ప్లాన్ అందుబాటులో ఉంది. తక్కువ డేటా వినియోగించేవారి ఈ ప్లాన్ బెస్ట్ ఆప్షన్ అవుతుంది. అంతేకాదు, తక్కువ ధరలో ఎక్కువ వ్యాలిడిటీని అందిస్తుంది. ఎయిర్‌టెల్ రూ.199 రీఛార్జ్ ప్లాన్ రూ.199 ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్ 2+దీ హై-స్పీడ్ డేటాను అందిస్తుంది.

ఈ ప్లాన్ ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ూమీూలను కూడా అందిస్తుంది. ఈ రీఛార్జ్ ప్లాన్ 28 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఈ ప్లాన్‌తో లభించే 2+దీ డేటాను ఒకేసారి లేదా 28 రోజులలో క్రమంగా ఉపయోగించుకోవచ్చు. అదనపు ప్రయోజనాల విషయానికి వస్తే, రూ.200 కంటే తక్కువ ధరకే లభించే ఈ ఎయిర్‌టెల్ ప్లాన్ 12 నెలల వ్యాలిడిటీతో రూ.4,000 విలువైన అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియంతో సహా ఇతర ప్రయోజనాలను అందిస్తుంది.

స్పామ్ కాల్స్, స్పామ్ మెసేజ్‌లలోని మోసపూరిత లింక్‌లను బ్లాక్ చేయడంతో పాటు, రియల్-టైమ్ అలర్ట్‌లను కూడా అందిస్తుంది. ప్రతి 30 రోజులకు ఒకసారి ఉచితంగా హలోట్యూన్ అందిస్తుంది. అంతేకాకుండా, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే ద్వారా కంపెనీ ఉచిత కంటెంట్ యాక్సెస్‌ను కూడా అందిస్తుంది.

## అత్యంత సౌకర్యవంతమైన 125CC స్కూటర్లు



చాలా మంది స్కూటర్ కొనుగోలుదారులు కొన్ని నెలలు పాటు స్కూటర్ నడిపిన తర్వాత, ప్రీమియం అనుభూతి సీటు సౌకర్యంపై ఆధారపడి ఉంటుందని గ్రహిస్తుంటారు. స్కూటర్ షోరూమ్‌లో చూడటానికి, చిన్న టెస్ట్ రైడ్‌లో బాగానే అనిపించినప్పటికీ రోజువారీ వాడకంలో ఆ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. రోజువారీ ట్రాఫిక్, కఠినమైన రోడ్లు, స్పీడ్ బ్రేకర్లు, వెనుక కూర్చోవడం, ఆఫీసుకు సుదీర్ఘ ప్రయాణాలు వంటివన్నీ స్కూటర్ ఎంత సౌకర్యవంతంగా ఉందో నిర్ణయించడంలో పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో తక్కువ బడ్జెట్‌లో ప్రీమియం అనుభూతి కోసం చూస్తే, ఈ కింది 125షెష స్కూటర్లు అత్యంత సౌకర్యాన్ని, అద్భుతమైన పనితీరును అందిస్తాయి. సుజుకి యాక్సెస్ 125 సుజుకి యాక్సెస్ 125 ధర రూ.79,885 (ఎక్స్-షోరూమ్). దీని సీటు పొడవుగా, వెడల్పుగా, సౌకర్యవంతంగా ఉంటుంది. దీనివల్ల సుదీర్ఘ ప్రయాణాలు సులభంగా చేయవచ్చు. దీని సౌకర్యవంతమైన రైడింగ్ పొజిషన్ తో ఎక్కువసేపు ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు అత్యంత సౌకర్యాన్ని అందిస్తుంది. టీవీఎస్ జూపిటర్ 125 టీవీఎస్ జూపిటర్ 125 ప్రారంభ ధర రూ.78,100 (ఎక్స్-షోరూమ్). కంపెనీ దీనిని పట్టణ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించింది. రైడింగ్ పొజిషన్ నిటారుగా, సహజంగా ఉంటుంది.

హీరో డెస్టిని 125 రూ.76,438 (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో లభించే హీరో డెస్టిని 125, తరచుగా కఠినమైన రోడ్ల, అధిక ట్రాఫిక్‌లో ప్రయాణించే రైడర్‌లకు బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. సుజుకి బర్గ్‌మన్ స్ట్రీట్ 125 సుజుకి బర్గ్‌మన్ స్ట్రీట్ 125 ధర రూ.1.02 లక్షలు (ఎక్స్-షోరూమ్). ఈ స్కూటర్ మాక్సీ-స్టైల్ డిజైన్‌ను కలిగి ఉంది. ఇది రైడర్‌లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీని పెద్ద సీటు, ఫుట్‌బోర్డ్ సుదీర్ఘ ప్రయాణాలలో సహాయపడతాయి. హోండా యాక్టివా 125 హోండా యాక్టివా 125 ధర రూ.90,178 (ఎక్స్-షోరూమ్). యాక్టివాలో సీటు సరళంగా ఉంటుంది. ఎర్గోనామిక్స్ ప్రామాణికంగా ఉంటాయి. ఎవరైనా కొన్ని నిమిషాల్లోనే దానిపై సౌకర్యవంతంగా కూర్చోగలరు.

## 'ఎక్స్‌కా' యంత్రాలు వచ్చేస్తున్నాయ్...

**హైదరాబాద్ :** ఎర్త్‌కాన్ ఎక్స్‌పో -2026లో ఎక్స్‌కా మెషీన్స్ ఏర్పాటు చేయనున్న స్టాల్, యంత్రాల అధికారిక ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆ సంస్థ వ్యవస్థాపకులు కృష్ణ కొల్లూరి, సిద్ధార్థ పొలిశెట్టి, కౌండిన్య అచ్యుతుని ఆహ్వానించారు.

ఈ మేరకు శనివారం సచివాలయంలో వారు మంత్రిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ ఎక్స్‌పో జూన్ 19,20,21 తేదీలలో హైదరాబాద్‌లో హైటెక్స్‌లో నిర్వహించనున్నారు.ప్రపంచ స్థాయి సమాచార సాంకేతిక, భారీ యంత్రాల రంగ అనుభవంతో తిరిగి వచ్చిన తెలుగు యువ పారిశ్రామికవేత్తలు ఈ సంస్థను నెలకొల్పారు.



## రణబాలి షూటింగ్ వీడియో లీక్..

# విజయ్ పవర్ ఫుల్ డైలాగ్‌కి ఫ్యాన్స్ ఫిదా



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మంధాన మూడోసారి జంటగా నటిస్తున్న చిత్రం రణబాలి.రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రారంభం నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన విజయ్-రష్మిక పెళ్లి ఫోటో, “ఏందయ్యా సామీ” పాటకు వచ్చిన స్పందనతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ‘రణబాలి’ కథ ఇదేనంటూ ఓ కథనం కూడా వైరల్ అవుతోంది.వైరల్ అవుతున్న కథ ప్రకారం, ‘రణబాలి’ 1876 ప్రాంతంలో బ్రిటిష్ పాలనలో ఉన్న రాయలసీమ నేపథ్యంలో సాగుతుంది. కరువు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో, బ్రిటిష్ అధికారి ప్రజలను మరింత దెబ్బతీసే విధంగా ఆర్టిఫిషియల్ ఫామైన్ సృష్టిస్తాడు. ధాన్యాన్ని గిడ్డంగుల్లో నిల్వచేసి ప్రజలను ఆకలితో వేదించే ఈ క్రూర యత్నం కథకు ప్రధాన నేపథ్యంగా నిలుస్తుంది.ఈ పరిస్థితుల్లో రంగంలోకి దిగే హీరో రణబాలి. ఒకప్పుడు చిన్న సంస్థానానికి వారసుడైన అతను, ప్రజల కోసం పోరాడే యోధుడిగా మారతాడు. బ్రిటిష్ అధికారులకు అతను ప్రమాదకరుడిగా కనిపించినా, ప్రజల దృష్టిలో మాత్రం ఆశగా నిలుస్తాడు. ఇక హీరోయిన్ జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనుంది. కరువు తన కుటుంబాన్ని దెబ్బతీసినా ధైర్యంగా నిలిచే జయమ్మ, రణబాలి పోరాటానికి భావోద్వేగ బలం అవుతుంది. వీరిద్దరి మధ్య ప్రేమ సహజంగా, గ్రామీణ నేపథ్యంతో ముడిపడి ఉంటుంది. కథలో రణబాలి గెరిల్లా యుద్ధంతో బ్రిటిష్ గిడ్డంగులపై దాడులు చేస్తూ, ప్రజలకు ఆహారం పంచడం, దేశ సంపదను విదేశాలకు తరలించే ప్రయత్నాలను అడ్డుకోవడం వంటి అంశాలు ఉంటాయని తెలుస్తోంది. అలాగే ఆ సంపదతో ప్రజలకు సహాయం చేస్తూ ఆశ నింపే పాత్రగా అతను నిలుస్తాడు.ఈ పోరాటాన్ని అణిచివేయడానికి బ్రిటిష్ అధికారి రణబాలి తలను తీసుకొచ్చిన వారికి భారీ బహుమతి ప్రకటిస్తాడు. అక్కడినుంచి కథ మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది. చివరికి బ్రిటిష్ రికార్డుల ప్రకారం రణబాలి మరణించినట్లు చూపించినా, ప్రజల మనసుల్లో అతను చిరస్థాయిగా నిలిచే నాయకుడిగా మిగిలిపోతాడనే ట్విస్ట్ కథలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా రణబాలి షూటింగ్ లొకేషన్ నుండి విజయ్ దేవరకొండకి సంబంధించిన వీడియో ఒకటి లీక్ అయింది. ఇందులో విజయ్ చేతిలో కత్తి పట్టుకొని గుర్రంపై ఇళ్లలోకి వచ్చి.. ఒరేయ్ ముండమోపి నా కొడకా...ఏడున్నావ్ రా.. మీ ఇళ్లలోకి వచ్చా.. రా అవ్వా చంపుదువ్ కాని .. అనే డైలాగ్ చెబుతాడు. చూస్తుంటే విజయ్ ఈ సినిమాతో మంచి హిట్ కొట్టేలా ఉన్నాడని అంటున్నారు.

# ఆట పేరుతో బుక్కయిపోయిన ఆలియా



ఒకరితో ప్రేమలో ఉన్నాడని తెలిసీ ఆయువకుడిని ప్రేమిస్తానని, అతడినే ఇష్టపడతానని అంటే దాని అర్థం ఏమిటి? నైతికంగా తప్పుడు ప్రవర్తన గానే దీనిని భావిస్తారు. అయితే సిగ్గు విడిచి అలాంటి పనికి తాను సిద్ధమేనని ఒప్పుకుంది ఆలియా భట్. టూమచ్ విత్ ట్వింకిల్ అండ్ కాజోల్ షోలోమీరు ఇష్టపడతారా? అనే విచిత్రమైన విభాగంలో ఆలియా భట్ తన గుట్టును దాచుకోకుండా బయటపెట్టేసింది. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ క్లిప్ అంతర్జాలంలో వైరల్ అవుతోంది. వీడియో క్లిప్ చూడ గానే ఆలియా భట్‌పై నెటిజనులు విరుచుకుపడుతున్నారు. గేమ్ షోలో ఆలియా వ్యాఖ్యానిస్తూ, తన స్నేహితురాలి మాజీతో ప్రేమలో పడతాను అనే ఆప్షన్ ని ఎంచుకుంది. ఇది నిజంగా కత్రినను మోసం చేయడమే నని కూడా జనం కామెంట్ చేస్తున్నారు. ఆ సమయంలో కాజోల్, వరుణ్ అందరూ ఆశ్చర్యపోయారు. గతంలో కత్రినతో రణబీర్ రిలేషన్ షిప్ లో ఉన్న సమయంలోనే ఆలియాతోను అతడు డేటింగ్ చేసాడనే పుకార్లు ఉన్నాయి. ఇప్పుడు మరోసారి ఆలియా కారణంగానే రణబీర్ తన ప్రియురాలు కత్రిన నుంచి విడిపోయాడు! అనే అర్థం వచ్చేలా వ్యవహారం కనబడటంతో నెటిజనులు ఆలియాపై విరుచుకుపడుతున్నారు.ఆలియా కారణంగానే రణబీర్ తనప్రేయసి కత్రినను మోసం చేసా డా?అంటూ ప్రశ్నిస్తున్నారు. అసలే ఆలియా కారణంగానే ఇలా జరిగి ందని అప్పట్లో పుకార్లు ఉన్నాయి.. వాటిని ఇంకా ప్రజలు మర్చిపోక పోయినా, ఇప్పుడు ఆలియా నోరు జారడం కొంప ముంచింది.

# సంయుక్త మీనన్ ..ది బ్లాక్ గోల్డ్



ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ‘ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణెళి మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# బిజీగా ప్రియాంక అరుళ్




టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం.. 'ఓజి'.పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాపై హైప్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రియాంక అరుళ్ మోహన్ ఎంట్రీతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్రియాంక పై విడుదలైన సాంగ్స్, కొన్ని విజువల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తన గ్లామరస్ ప్రెజెన్స్‌తో పాటు, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్క్రీన్ కెమిస్ట్రీక్రి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఆమె ఇప్పుడు సినిమా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రియాంక తాజాగా ఓజి ప్రమోషన్స్ కోసం బయటికొచ్చి ప్రింట్ మీడియా, వెబ్ మీడియా లకు ఇంటర్వ్యూలు ఇస్తూ చిత్రంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్ల అసలైన జోరు మొదలైందని చెప్పవచ్చు. ఇకపై ప్రియాంకతో పాటు- మిగతా ప్రధాన నటీ-నటు-లు కూడా ఈ ప్రమోషన్లలో భాగం కానున్నట్లు- సమాచారం. ఇక ఈ సినిమా పాన్-ఇండియా లెవెల్‌లో తెరకెక్కుతున్న నేపథ్యంలో, ఇతర భాషల్లో కూడా ప్రమోషన్స్ ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో కుతూహలంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఎంట్రీతో ఓజికి హిందీ లోను మంచి మార్కెట్ ఏర్పడింది. అందుకే హిందీలో ప్రత్యేక ప్రమోషన్లు ఎలాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాం శంగా మారింది. ఇప్పుడిప్పుడే మొదలైన ప్రమోషన్లతో సినిమా హంగామా మరింత పెరిగేలా కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో ఓజి టీ-మ్ నుంచి ఇంకా పెద్ద ప్రమోషనల్ ఈవెంట్స్, స్పెషల్ ఇంటర్వ్యూ లు, మ్యూజిక్ ఈవెంట్, ప్రీ-రిలీజ్ ఫంక్షన్ లాంటివి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ ప్రమోషన్ లు కలిపి సినిమా కోసం ప్రేక్షకుల అంచనాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయం.

# ప్రభాస్‌తో ప్రశాంత్‌వర్మ మూవీ




జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్న రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో హర్రర్ కామెడీగా రూపొందుతోన్న రాజాసాబ్ త్వరలో విడుదలకు సిద్ధమవుతుతండగా, సందీప్ రెడ్డి వంగా స్పిరిట్, ప్రశాంత్ నీల్ సలార్ పార్ట్ 2, హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడికల్ వార్ డ్రామా ఫౌజీ, నాగ అశ్విన్ కల్కి పార్ట్2 సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే.. మరో ఆసక్తికరమైన అప్డేట్ వినిపిస్తోంది. హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధిం చిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు-సమాచారం.దీంతో షూటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్థంగా పని చేయగలరని అంటున్నారు.ఈ సినిమాకు ప్రస్తుతం ‘బ్రహ్మ రాక్షస్‘అనే వర్కింగ్ -టైటిల్ వినిపిస్తోంది. అయితే, -టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న 'హను-మాన్' సీక్వెల్ 'జై హను-మాన్' పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి.

# టైగర్ ష్రాఫ్‌తో జతకట్టనున్న కృతిశెట్టి



అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. ‘ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బ్జడెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ‘ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com